# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY

నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in








సంపుటి : 13 సంచిక : 65 రంగారెడ్డి గురువారం 02 జులై 2026 ఎడిటర్ : బవనారి రవికుమార్ 02-07-2026 Thursday పేజీలు : 8 వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada


## ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత విముక్తి..

### రూ.14,115 కోట్లతో భారీ రోడ్డు ప్రాజెక్టులకు ఆమోదం

ఢిల్లీ :నిర్భయవార్త :




ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ భేటీ జరిగింది. ఈ మేరకు మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భేటీలో రూ. 14,115 కోట్ల విలువైన భారీ రోడ్డు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేశామని అన్నారు. ముఖ్యంగా రాజధాని ఢిల్లీ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత విముక్తి కల్పించడంతో పాటు పొరుగు రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో కనెక్టివిటీని పెంచేందుకు కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు.నిఆరు లేన్లతో ద్వారకా టన్నెల్ ప్రాజెక్టు..నినికేబినెట్ నిర్ణయాల్లో భాగంగా అత్యంత కీలకమైనది ఢిల్లీలోని ద్వారకా టన్నెల్ ప్రాజెక్టు. దాదాపు రూ. 6,970 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆరు లేన్ల అండర్‌గ్రౌండ్ టన్నెల్ రాజధానిలో ట్రాఫిక్ రద్దీని భారీగా తగ్గించనుంది. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 8.1 కిలో మీటర్ల మేర కొత్త కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇక ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న శివమూర్తి ఇంటర్‌ఛేంజ్ నుంచి ప్రారంభం కానుంది. అది అక్కడ నుంచి వసంత కుంజ్, నెల్సన్ మండేలా మార్గ్ మీదుగా సాగుతుంది. చివరిగా బారాపుల్లా డ్రైన్ సమీపంలోని ఎలివేటెడ్ కారిడార్ గుండా ప్రయాణించి DND ఫ్లైవేకి లింక్ చేయనున్నారు.

(మిగతా 3లో..)

## హైదరాబాద్‌లో ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్..

### అనలాగ్, మెగా సంస్థలతో సర్కార్ బిగ్ డీల్



నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :

హైదరాబాద్ మహానగరంలో రవాణా, మౌలిక వసతుల రంగాన్ని సరికొత్త సాంకేతికతతో తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ అనలాగ్, మౌలిక వసతుల దిగ్గజం మెగా ఇంజనీరింగ్ సంయుక్త భాగస్వామ్యంతో రాష్ట్రంలో అత్యాధునిక ప్రాజెక్టులను చేపట్టేందుకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రుల సమక్షంలో అనలాగ్ సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఎండీ పి.కృష్ణారెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అయితే, భవిష్యత్ తరాల అవసరాల కోసం 'నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్', రోబోటిక్స్, సెన్సార్ల ఆధారిత 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ప్లాట్‌ఫామ్స్ వినియోగాన్ని ప్రతినిధులు సీఎంకు వివరించారు. దీని ద్వారా హైదరాబాద్‌ను 'కాగ్నిటివ్ సిటీ'గా మార్చవచ్చని.. రోడ్లపై అంబులెన్స్‌లకు ఆటోమేటిక్‌గా మార్గం సుగమం చేయడం, నీటి లీకేజీలను ముందే గుర్తించడం, స్మార్ట్ పవర్ మేనేజ్‌మెంట్ వంటి సేవలు సాధ్యమవుతాయని తెలిపారు. నగరంలో చేపట్టబోయే ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను కూడా ఈ సందర్భంగా సీఎంకు సమర్పించారు. ఈ ప్రెజెంటేషన్‌పై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఇరు సంస్థలకు పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలోని అన్ని ట్రాఫిక్

(మిగతా 3 లో..)

## తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టొద్దు..

### నితిన్ నబీన్‌కు మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్



నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన అట్టర్ ప్లాప్ అయిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బీజేపీకి తెలంగాణలో అవకాశం లేదని ఆ పార్టీ అవసరం ఇక్కడ లేదన్నారు. మూడు రోజుల పర్యటనలో నితిన్ నబీన్ ఏం చేశారు? రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల గురించి ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్ తెలంగాణ పరిస్థితుల మీద, కుల సమీకరణలు, ఉద్యమం మీద ఆయనకు అవగాహన ఉందా? అని నిలదీశారు. బీజేపీ ముక్త్ భారత్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

**ఎంత రెచ్చగొట్టినా ఎలాంటి ధోకా లేదు:**

సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాకారం అయిందని వేల మంది ప్రాణ త్యాగం వల్ల రాష్ట్రం

(మిగతా 3లో..)

## బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం..

### బాధితురాలికి హైకోర్టు నోటీసులు

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :




పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై బుధవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. తనపై నమోదైన కేసు తప్పుడుదని, ఇదంతా పూర్తిగా రాజకీయ ప్రేరేపితంగా జరిగిన వ్యవహారమని భగీరథ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని పోలీసుల విచారణకు సహకరిస్తున్నానని పేర్కొంటూ తనకు బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే నిందితుడి బెయిల్ అభ్యర్థనపై బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉన్నందున, ఈ విషయమై కౌంటర్ దాఖలు చేయాలంటూ బాధితురాలికి న్యాయస్థానంనోటీసులు జారీ చేసింది.అనంతరంతదుపరి విచారణశుక్రవారానికి వాయిదా వేసింది.

**బెయిల్ ముగియడంతో ఇటీవల మళ్లీ జైలుకు:**


కాగా ఓ మైనర్ బాలికను లైంగికంగా వేధించిన వ్యవహారంలో బండి బగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసుస్టేషన్‌లో మే 8న పోక్సో కేసు నమోదైంది. అనంతరం పరారైన భగీరథ్‌ను మే 16న పోలీసులు అరెస్టు చేసి, చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ క్రమంలో తన ఇంజినీరింగ్ పరీక్షలు రాసేందుకు వీలుగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు భగీరథ్‌కు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. గత ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు మధ్యంతర బెయిలు లభించింది. అయితే బెయిల్ గడువు ముగియడంతో గత గురువారం తిరిగి అతడిని చర్లపల్లి జైలుకు అధికారులు తరలించారు. ఈ క్రమంలో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ విచారణకు రావడంతో శుక్రవారానికి హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది అనేది ఉత్కంఠగా మారింది.

## ఊహాజనిత బడ్జెట్ వద్దు..

### వాస్తవికంగానే వెళ్దాం..

### ఆదాయ సమీకరణపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :



రాష్ట్ర బడ్జెట్ లక్ష్యాలను విజయవంతంగా సాధించాలంటే ఆదాయ సమీకరణపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదాయం పెంపుదల, నిధుల సమీకరణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన క్యాంపు ఆఫీసులో ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదాయ లీకేజీలను అరికట్టడానికి HMDA, TGIIC, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్ వంటి కీలక శాఖలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఆదాయ పెంపు ప్రక్రియను రోజువారీగా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక 'చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి, నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు.నినిప్రభుత్వ పథకాల పారదర్శకత కోసం సరికొత్త సాంకేతికతను వాడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను ఖరారు చేయాలని, దానిని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్‌కి అనుసంధానం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఇకపై కేవలం అంకెలకే పరిమితమయ్యే ఊహాజనిత బడ్జెట్ కాకుండా, క్షేత్రస్థాయి వాస్తవికత ఆధారంగానే కొత్త బడ్జెట్‌ను రూపొందించుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా నిధుల కేటాయింపులు ఉండాలని, అందుకోసం భూసేకరణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించాలంటే శాఖల వారీగా అధికారులు తమ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

## చరిత్ర పుటల్లోకి ఉపాధి హామీ పథకం

### దేశ వ్యాప్తంగా అమల్లోకి వచ్చిన 'జీ రామ్ జీ' చట్టం



ఢిల్లీ :నిర్భయవార్త :

భారత దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెను సంచలనం సృష్టించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కాలగర్భంలో కలిసిపోయింది. నరేగా స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్, అజీవికా మిషన్–గ్రామీణ్ ' చట్టం బుధవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు ఉన్న ఉపాధి హామీలో ప్రతి కూలీకి 100 రోజుల పని దినాలు ఉండగా, కొత్తగా వచ్చిన చట్టం ప్రకారం ఇకపై గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల ఉపాధి హామీతో పాటు రోజూ వారీ కనీస వేతనం రూ. 300 గా ఖరారు చేశారు. గతంలో 263 రకాల పనులకు మాత్రమే అనుమతి ఉండగా ఈ నూతన పథకంలో ఆ సంఖ్యను 318కి పెంచారు. అలాగే గతంలో నరేగా కోసం కేంద్రం 100 శాతం నిధులు కేటాయిస్తుంటే ప్రస్తుత మార్పుల వల్ల కేంద్రం 60 శాతం,

(మిగతా 3 లో..)

## ఈసారి గోదావరి, కృష్ణా నీళ్లు వచ్చేలా లేవు: సీఎం చంద్రబాబు



నిర్భయవార్త ప్రతినిధి : అమరావతి :

భారత దేశంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. దీని వల్ల వర్షాలు తగ్గి కరవు పరిస్థితులు, వేడిగాలులు వీచే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రభావం దేశంతో పాటు ఏపీపైనా ప్రభావం చూపుతుందని చెప్పారు. గత సంవత్సరం జూన్ నెలలోనే ప్రాజెక్టులకు నీళ్లు వచ్చాయని, ఈ సంవత్సరం జులై అయినా నీళ్లు వచ్చే పరిస్థితి లేదని సీఎం చంద్రబాబు అంచనా వేశారు.

**ఈసారి కష్టమే..**

వర్షాలు లేక కృష్ణ, గోదావరి నుంచి నీళ్లు వచ్చేలా లేవన్నారు. గోదావరి, కావేరి అనుసంధానం కోసం ప్రయత్నిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. నెల్లూరు పొన్నపువారి పాలెంలో ఆయన మాట్లాడుతూ యుద్ధం వల్ల నిత్యావసరాలన్ని ధరలు పెరిగాయని చెప్పారు. కష్టాలు వచ్చిన సమయంలో తెలివిగా వ్యవహరించాలని సూచించారు. దేశం నాకేమిచ్చిందని కాకుండా మనమేమి ఇచ్చామని ఆలోచించాలని చెప్పారు. తన లక్ష్యం అభివృద్ధి, సంక్షేమనని స్పష్టం చేశారు. మెరుగైన జీవన ప్రమాణాలను ప్రజలకు అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

నిర్భయవార్త

సంపాదకీయం


గురువారం 02 జులై 2026

# ప్రమాద ఘంటికలు...

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తుండటం ప్రమాదకరం. ప్రఖ్యాత ఆంగ్ల దినపత్రిక 'ది టెలిగ్రాఫ్' మాజీ సంపాదకులు ఆర్ రాజగోపాల్ ఎస్ఐఆర్‌లో ఓటు హక్కు కోల్పోవడం, ఆ తరువాత ఆయన పాస్‌పోర్టు పునరుద్ధరణను నిలిపివేయడం కేంద్ర ప్రభుత్వ ప్రతీకార చర్యలకు పరాకాష్ట. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలను నిర్వహించడం ద్వారా నిష్పక్షపాత రాజ్యాంగ సంస్థగా వ్యవహరించాల్సిన భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) పూర్తిగా భ్రష్టు పట్టడం దురదృష్టకరం. ఏడాది కాలంలోనే దాదాపు ఆరు కోట్ల మంది ఓటు హక్కును హరించింది. మైనారిటీలు, దళితులు, వలస కూలీలు, నిరుపేదలు, మహిళల ఓట్లు తొలగింపునకు గురయ్యాయని తొలుత ఆందోళన వ్యక్తమైంది. తాజాగా రాజగోపాల్ ఉదంతంతో బిజెపి, సంఘ్ పరివార్ మతతత్వ భావజాలాన్ని వ్యతిరేకించే ప్రపంచ ప్రఖ్యాత సంపాదకులు సహా అందరికీ ఈ ముప్పు పొంచివుందని రూఢి అయింది. 30 ఏళ్లుగా కొల్‌కతాలో నివాసముంటూ... 'ది టెలిగ్రాఫ్, ఎకనామిక్ టైమ్స్, బిజినెస్ స్టాండర్డ్' లాంటి పత్రికలకు ఆయన సంపాదక బాధ్యతలు నిర్వహించారు. ఆయన తల్లిదండ్రులు ప్రొఫెసర్లుగా సమాజంలో గుర్తింపు పొందారు. వారి పేర్లు 2002 జాబితాలో కనిపించలేదన్న కారణంగా... జన్మ ధృవపత్రం, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్ సహా అన్ని ఆధారాలు సమర్పించినా... ?ఓటు తొలగించడం ఇసిఐ కక్షపూరిత వైఖరికి నిదర్శనం. ఓటు లేనందున పాస్ పోర్టును పునరుద్ధరించేది లేదని తేల్చిచెప్పారు. 1967 పాస్ పోర్టు చట్టం ప్రకారం ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించడం పాస్ పోర్టు పునరుద్ధరణ దరఖాస్తు తిరస్కరణకు కారణం కాకూడదని స్వయంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం పరిగణనలోకి తీసుకోకపోవడం అసమంజసం. రాజగోపాల్ ఓటు హక్కును, పాస్ పోర్టును పునరుద్ధరించి తప్పును సరి చేసుకోవడం ఇసిఐ, కేంద్ర ప్రభుత్వ బాధ్యత. పౌరసత్వానికి పాస్ పోర్టు ప్రామాణికం కాదని విదేశాల్లో ప్రయాణించడానికి ఒక ప్రామాణిక పత్రమేనని ఇటీవల విదేశీ వ్యవహారాల శాఖ అధికారి ఒకరు ఇటీవల చేసిన ప్రకటన దేశ పౌరుల్లో మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. ఏ పత్రం ప్రామాణికమో చెప్పాలన్న ప్రజల డిమాండ్‌కు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులదే. ఎస్ఐఆర్‌లో తొలగింపునకు గురైన ఓటర్లు సంక్షేమ పథకాలకు అనర్హులని ఇప్పటికే పశ్చిమ బెంగాల్, బీహార్‌లోని బిజెపి ప్రభుత్వాలు ప్రకటించాయి. ఉత్తరప్రదేశ్ సహా బిజెపి పాలిత రాష్ట్రాలన్నీ కసరత్తు ముమ్మరం చేశాయి. బెంగాల్‌లో మహిళలకు 'లక్ష్మీ భాండార్' పేరుతో అమలవుతున్న పథకానికి ఓటు లేని మహిళల పేర్లను తొలగించే, రేషన్ కార్డులను రద్దు చేసే ప్రక్రియ ప్రారంభించేశారు. రేషన్ సహా ఎటువంటి ప్రభుత్వ ప్రయోజనాలకు అర్హులు కాదని, వారి బ్యాంకు ఖాతాలను కూడా రద్దు చేస్తామని బీహార్ సి.ఎం ప్రకటించారు. బెంగాల్‌లో 91 లక్షల మంది, బీహార్‌లో 47 లక్షల మంది, మహారాష్ట్రలో 22 లక్షల మంది రేషన్ కార్డులు సహా సర్వ హక్కులూ కోల్పోయే ప్రమాదం పొంచి వుంది. కర్ణాటక సి.ఎం సైతం ఇదే విధమైన హెచ్చరిక చేశారు. సంపాదకులు రాజగోపాల్ అయినా... సామాన్యులైనా.. ఓటు హక్కు కోల్పోతే సర్వ హక్కులూ కోల్పోయి రెండో తరగతి పౌరులుగా జీవించాల్సిన దుస్థితిలోకి నెట్టేసే ఎస్ఐఆర్‌పై ప్రజలంతా అప్రమత్తం కావాలి. తనపై వస్తున్న విమర్శల నుంచి గుణపాఠం నేర్చుకుని, ఓటర్ల హక్కులను పరిరక్షించడానికి బదులుగా, తన ఉల్లంఘనలను పట్టించుకోకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా అనేక రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను కొనసాగిస్తున్న ఇసిఐ తీరును ఓటర్లంతా ఎండగట్టాలి. ఇ.సి పక్షపాత ధోరణిపై 23 ప్రతిపక్ష పార్టీలు సిజెఐకు తాజాగా లేఖ రాశాయి. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మొత్తంలో పారదర్శకతను డిమాండ్ చేస్తూ, ఎస్ఐఆర్‌లో అర్హుల ఓట్ల తొలగింపును వ్యతిరేకిస్తూ ప్రజలంతా పోరాడాలి. ప్రజాచైతన్యంతోనే భ్రష్టుపట్టిన ఇసిఐ ను ప్రక్షాళన చేయడం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం, రెండో తరగతి పౌరులుగా మార్చేందుకు ఆర్‌ఎస్ఎస్, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చేస్తున్న యత్నాలను తిప్పికొట్టడం సాధ్యమవుతుంది.

# అయోధ్య' అవినీతికి జవాబుదారీ ఎవరు?

బాబ్రీ మసీదు కట్టడాన్ని కూల్చివేసిన రోజు (డిసెంబర్ 6, 1992) ముందు రాత్రి అయోధ్యలో సీనియర్ ఆర్‌ఎస్ఎస్ సభ్యుడు, జర్నలిస్టు, రామజన్మభూమి ఉద్యమం సమయంలో మీడియా వ్యవహారాలను పర్యవేక్షించిన రమా శంకర్ అగ్నిహోత్రిని కలుసుకున్నాను. ఆయన పక్కనే ఉన్న ఫైజాబాద్ (అయోధ్య) ఎంపీ వినయ్ కతియార్ నాకు కరసేవ గురించి సమాచారం ఇచ్చారు. భజరంగ్‌దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా ఆయన రామ జన్మభూమి ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన వారిలో ఒకరు. అశోక్ సింఘాల్, వినయ్ కతియార్, కల్యాణ్ సింగ్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువు మహంత్ వైద్యనాథ్, ఉమాభారతి, సాధ్వి రితంభర వంటి నేతలు లేకపోతే రామజన్మభూమి ఉద్యమమే లేదు. రామ్ రథయాత్ర పేరిట ప్రజల్లోకి వెళ్లిన ఆద్వాణీ ఈ ఉద్యమానికి రాజకీయ రూపమే కాని, అసలు ఉద్యమం నిర్వహించిన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ వంటి శక్తులు వేరు. అయోధ్య నుంచి మూడుసార్లు గెలిచిన వినయ్ కతియార్ 'మందిర్ వహీ బనాయేంగే' వంటి నినాదాలతో ప్రాచుర్యం పొందారు. అలాంటి వినయ్ కతియార్ ఇవాళ అయోధ్యలో జరుగుతున్న పరిణామాలను తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఆలయంలో ఉన్న హుండీల నుంచి భారీ ఎత్తున నగదు, ఆభరణాలను దోచుకోవడంపై ఆయన తీవ్ర మనస్తాపం ప్రకటించారు. 'ప్రస్తుతం ఉన్నవారందరూ దొంగలే' అని ఆయన అన్నారంటేనే పరిస్థితి తీవ్రత మనకు అర్థమవుతుంది. వినయ్ కతియార్ మాత్రమే కాదు, అనేకమంది సాధువులు కూడా ఈ దోపిడీని ఖండించారు. 'నిధులు దోచుకున్నవారు రావణులు' అని భాగేశ్వర్‌ధామ్ అధినేత ధీరేంద్ర కృష్ణశాస్త్రి అన్నారు. స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి, ప్రవచనకర్త దేవకీనందన్ ఠాకూర్, మహంత్ కమల్‌నయన్ దాస్ వంటి సాధువులు ఎందరో ఈ దోపిడీ వెనుక శక్తిమంతులు ఉన్నారని ఆరోపించారు. 'ఈ విషయంలో నేను నిజం చెపితే సమస్యల్లో పడతాను' అని బీజేపీ మాజీ ఎంపీ ఒకరు అన్నారు. ఆలయ నిర్మాణం, ఆస్తుల నిర్వహణ, ప్రజల విరాళాలను నిర్వహించేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటు చేసినప్పటి నుంచే ఈ నిధులను కొల్లగొడుతున్నారని, భక్తులు సమర్పించిన బంగారం, వెండి, నగలపై ఎవరూ సరిగా లెక్కలు రాయలేదని ట్రస్టు మాజీ సీఈఓ మహిపాల్‌సింగ్ ఆరోపించారు.




ఓచర్లకూ, నగదు, నగలకు మధ్య పొంతన లేదని ఆయన ఎత్తి చూపిన తర్వాత దర్యాప్తు చేసేందుకు బదులు ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. 2026 జూన్ 7న ఈ విషయం సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ ప్రస్తావించి, న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేసిన తర్వాతే అయోధ్య విరాళాల బాగోతం బయటకు పొక్కింది. బ్యాంకు ఖాతాలు, ట్రస్టు ఖాతాలను ప్రజలకు చూపించి పారదర్శకంగా వెల్లడించాలని బీజేపీ నేత రజనీష్‌సింగ్ నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఎట్టకేలకు జూన్ 13న ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించింది. అయోధ్యలో రామజన్మభూమి కోసం భక్తులు ఎంత పెద్ద సంఖ్యలో విరాళాలు, ఆభరణాలు, బంగారం, వెండి ఇటుకలు సమర్పించారో లెక్క తెలియదు. అక్షింతల పంపిణీ పేరిట, 'రామ్ రామ్ గ్రామ్ అభియాన్' పేరిట నిర్వహించిన కార్యక్రమాలకు అనేకమంది భక్తులు తాదాత్మ్యంతో ప్రతిస్పందించారు. సీసీటీవీ కెమెరాల్లో కనీసం 70సార్లు నగదు తీసుకువెళుతున్నట్లు, మూటలు మోసుకెళుతున్నట్లు దృశ్యాలు బహిర్గతమయ్యాయి. సిబ్బంది కొందరు కావాలనే కెమెరాలకు అడ్డుగా నిలుచుని హుండీల నుంచి నగదు కాజేసే దృశ్యాలు రికార్డు కాకుండా చేశారని సిట్ తేల్చింది. దోచుకున్న డబ్బుతో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారన్న సమాచారం కూడా లభించింది. సిట్ అరెస్టు చేసిన వారిలో నోట్లు లెక్కపెట్టే కొందరు అధికారులు, ట్రస్టు ప్రధాన కార్యదర్శి, వీహెచ్‌పీ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చంపత్‌రాయ్ బన్సల్, ఆయన వ్యక్తిగత డ్రైవర్ రమాశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్ తదితరులు ఉన్నారు. కానీ బాధ్యత వహించాల్సిన చంపత్ రాయ్ బన్సల్, ట్రస్టీ అనిల్ మిశ్రాలు కేవలం రాజీనామాలు చేశారు. అనిల్ మిశ్రా అయోధ్యలో అధునాతన సౌకర్యాలతో మూడంతస్తుల బ్రహ్మాండమైన బంగళాను నిర్మించుకున్నారని వార్తలు వచ్చాయి. నిజానికి అయోధ్యలో కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ వ్యవహారాలు నడిపిన అలోక్ బన్సల్, ఆయన సతీమణి శివానీ బన్సల్, చందన్ రాయ్ బన్సల్, మనీష్ బన్సల్ తదితరులు చంపత్ రాయ్ బంధువర్గీయులే, సిట్ స్వాధీనం చేసుకున్న అనేక భూమి కొనుగోళ్ల పత్రాలు మీడియాకు చేరాయి. మహారాష్ట్రకు చెందిన కర్ణాటక ప్రాంత ప్రచారక్, వీహెచ్‌పీ కేంద్ర జాయింట్ సెక్రటరీ గోపాల్‌రావును పరిపాలనా అధికారిగా నియమించింది. చంపత్ రాయ్ తర్వాత అత్యంత శక్తిమంతుడైన గోపాల్‌రావు అయోధ్యలో అనేక ఉడుపి హోటల్స్ సృష్టికర్త అని కూడా సమాచారం. రామమందిర ఉద్యమం అనేదే లేకపోతే భారతీయ జనతా పార్టీయే లేదు అన్నది పూర్తిగా సత్యదూరం కాదు. బీజేపీ ఉత్థానంలో రామజన్మభూమి పాత్ర ఉన్నదన్న విషయం లాల్‌కృష్ణ ఆద్వాణీయే తన జీవిత చరిత్రలో వివరించారు. రామజన్మభూమి ఉద్యమాన్ని స్వతంత్ర భారత చరిత్రలో అతి పెద్ద ప్రజా ఉద్యమంగా ఆయన అభివర్ణించారు. సోమనాథ్ నుంచి ఆయన రథయాత్ర జరిపిన తర్వాతే 1991 ఎన్నికల్లో బీజేపీకి 120 సీట్లు లభించాయి. 1998లో బీజేపీ ఎన్నికల ప్రణాళికలో రామమందిరం గురించి వాగ్దానం చేసింది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడింది. మతం పట్ల ప్రజలకు ఉన్న మమేకతను సానుకూల దిశలో మళ్లించినట్లయితే ఒక అద్భుతమైన శక్తిగా తీర్చిదిద్దగలమని నిరూపించామని, ఒక దేశ ఆత్మ వ్యక్తీకరణతో ప్రజల సామూహిక వ్యక్తీకరణ కలిసికట్టుగా ప్రతిధ్వనించిందని ఆయన ప్రకటించారు. తన ఉద్యమం ద్వారా నిద్రాణంగా ఉన్న హిందూత్వను మేలుకొల్పాలని భావించిన ఆద్వాణీ రాముడిని భారత జాతీయ వ్యక్తిత్వానికి, సమైక్యతకు, సమగ్రతకు విశిష్టమైన సంకేతంగా అభివర్ణించారు. ఈ ఉద్యమం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ రామజన్మభూమి కోసం చేసిన ఎన్నో త్యాగాలు పరమార్థం కోల్పోయినట్లు కనిపిస్తోంది. కొన్ని దశాబ్దాలుగా రామాయణం ఈ దేశంలో సమున్నత నైతిక విలువల వ్యవస్థను ప్రభావితం చేసిందని ఆద్వాణీ లాంటి వారు భావించారు. మతానికీ, మత వ్యవస్థకూ రామాయణం అతీతమైనదని ఆర్ష విజ్ఞాన ట్రస్టును నెలకొల్పిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి పమిడిఘంటం కోదండరామయ్య రాశారు. 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నట్లుగా రాముడు రూపుదాల్చిన ధర్మం కనుకనే భారతదేశంలో రామాయణం కలకాలం నిలిచిందని ఆయన తన 'రామాయణ ప్రభ' గ్రంథంలో పేర్కొన్నారు. శ్రీరాముడి సత్యసంధత గురించి వాల్మీకి రామాయణంలో అడుగడుగునా ప్రస్తావించారని, ఆ సత్యవాక్పరిపాలనే యుగయుగాలుగా భారతీయ సమాజాన్ని ప్రభావితం చేసిందని ఇలపావులూరి పాండురంగారావు వంటి పండితులు చెప్పారు. రాముడిని మూర్తీభవించిన ధర్మదేవతగా మారీచుడితో వాల్మీకి చెప్పించారు. రాముడు సత్యపరాక్రముడని, సత్య ధర్మ పరాయణుడని, సత్యసంధుడని, సత్యశీలుడని, సత్యమే ఆత్మగా కలవాడని వాల్మీకి ప్రశంసించారు. 'సత్యమొక్కటే దైవం, లోకంలో భక్తికి ఆధారభూతం సత్యమే. అన్నిటికీ మూలమున్నది సత్యంలోనే. సత్యానికి మించి ఉన్నత లక్ష్యం లేనే లేదు' అని వాల్మీకి చెప్పారు. 'ధర్మం పుట్టేది బలం లోంచి. (బలో ప్రతిష్ఠో ధర్మః ధరణ్యామివ జంగమం.) 'ధర్మమూ, బలమూ సత్యానికి తోడయితే ఏ మహా విపత్తు నుంచైనా కాపాడగలుగుతాయి' అని ఆయన సూత్రీకరించారు. సత్యం ద్వారా సమస్త లోకాన్ని జయించవచ్చునని అన్నారు. 'నాకు ధన కనక వస్తువాహనాలపై మోహం లేదు నాకు కావల్సింది రాజ్యం కాదు (నాహమర్థ పరో దేవి లోకమావస్తు ముత్సహే)' అని రాముడితోనే వాల్మీకి చెప్పిస్తారు. కాని ఇప్పుడు జరుగుతున్నదేమిటి? రామాయణం అంటే రాముడు నడిచిన దారి అని అర్థం. ఆ దారిలో మనం నడుస్తున్నామా? ఇవాళ బలవంతులు సత్యానికీ, ధర్మానికీ అండగా ఉన్నారా? అధికారం కంటే దేశమే ముఖ్యమని భావిస్తున్నారా? రామమందిరం నిర్మించి రాముడి విగ్రహం ప్రతిష్ఠాపిస్తే సరిపోతుందా? దేశంలో అంతటా సత్యం, ధర్మం అనే వాటికి ఏ మాత్రం విలువ లేదని, స్వప్రయోజనాలు, ధనార్జన, అధికార ఆకాంక్ష, దౌర్జన్య పాలనే ధ్యేయంగా మారిందని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. 'అధికారం అవినీతికి దారితీస్తుంది. సంపూర్ణ అధికారం సంపూర్ణ అవినీతికి దారితీస్తుంది' అన్న సూక్తిని ఇతర పార్టీలతో పాటు బీజేపీ నేతలు కూడా నిరూపిస్తున్నారు. సంఘ్ పరివార్‌లో సైతం కొందరు అవినీతికి అతీతులు కాదని తేలింది. ఇవాళ బీజేపీలోనూ, సంఘ్‌లోను నానాజీ దేశ్‌ముఖ్, కుశాభావు ఠాక్రే, జేపీ మాథుర్, బైరాన్ సింగ్ షెఖావత్, లక్ష్మణరావు ఇనామ్‌దార్ వంటి నీతిమంతుల కోసం అన్వేషించాల్సి వస్తోంది. ఆలయం నిర్వహణను సంఘ్ నుంచి ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకునేందుకో లేక యోగి ఆదిత్యనాథ్‌ను ఇరకాటంలో పెట్టేందుకో అయోధ్య విరాళాల దోపిడీని రచ్చ కెక్కించారన్న ప్రచారం కూడా జరుగుతోంది. దేశ రాజకీయాల్లో బీజేపీ పట్టు పూర్తిగా బిగుస్తుందనుకున్న సమయంలో ఆ పార్టీ పురోగతికి కారణమైన అయోధ్యలో దోపిడీ జరగడం ఒక దుష్పరిణామం. ఈ పరిణామం ప్రజల్లో కలవరం సృష్టిస్తోంది. ఇవాళ అయోధ్యలో న్యాయవాదులు కూడా దోపిడీదారుల తరఫున వాదించేందుకు నిరాకరిస్తున్నారు. ఇది ఒక రాజకీయ పార్టీపైనో, ఆర్‌ఎస్ఎస్ లాంటి హిందూ ధర్మానికి కట్టుబడ్డామని చెప్పుకుంటున్న సంస్థపైనో వచ్చిన కళంకం కాదు. దేశంలో శ్రీరాముడిని, రామాయణాన్ని ఆరాధించే ప్రజల మనసులపై ఏర్పడ్డ గాయం. ఏ రాముడి బాణం బీజేపీ ఉత్థానానికి కారణమయిందో అదే బాణం బీజేపీ పతనానికి కారణం కాకుండా చూసుకోవల్సిన బాధ్యత ఆ పార్టీ నేతలపై ఉన్నది.

**ఎ. కృష్ణారావు**

# 'అస్తిత్వ' అవస్థల్లో భారతీయులు!

భారతీయుడా, నీవు భారతీయ పౌరుడువేనా?! విడ్డూరమైన కాలమిది. కాకపోతే భారతీయ పౌరుడుగా గుర్తింపు విషయంలో భారతీయులు అయోమయంలో పడవలసిరావడమేమిటి? సగటు భారతీయుడు తన జాతీయత నిర్ధారణకు న్యాయబద్ధమైన ప్రమాణం ఏమిటో తెలుసుకోవడానికి ప్రయాసపడుతున్నాడు అతడికి దిశా నిర్దేశం చేయవలసిన అధికార వ్యవస్థ ఇప్పటి వరకు స్పష్టమైన విధి విధానాలు వెల్లడించలేదు. ఇది విచిత్ర సందర్భం కాదూ ఒక దేశానికి సార్వభౌమాధికారం ఎంత ముఖ్యమో ఆ దేశవాసులకు జాతీయత, పౌరసత్వం ఉండడం కూడా అంతే ముఖ్యం. మన పొరుగు దేశాలు అయిన నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో అత్యంత వెనుకబడిన మారుమూల ప్రాంతాలలో సైతం పౌరసత్వం, జాతీయత విషయంలో స్పష్టమైన విధివిధానాలు అమలులో ఉన్నాయి. మరి భారత్‌లో ఆ ప్రాథమిక గుర్తింపుల విషయంలో ఒక కచ్చితమైన విధానం లేకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి ప్రామాణిక ధ్రువీకరణ కాదని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఆ పెద్దమనిషి ప్రకటన కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అసంఖ్యాకులను ఆందోళనకు గురిచేస్తోంది. చట్టాలు, అధికారిక నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్, పౌరసత్వం వేర్వేరు అంశాలే అయినప్పటికీ పరస్పర అనుసంధానం ఉన్న విషయాలు. దుబాయిలోని ప్రవాస భారతీయ కుటుంబాల నవజాత శిశువులకు తల్లిదండ్రుల పాస్‌పోర్ట్‌ల ఆధారంగా వారి జాతీయతను నిర్ధారించి, పౌరసత్వాన్ని నమోదు చేస్తారు. ఆ తరువాత మాత్రమే భారత విదేశాంగ శాఖ ఆ పసి ప్రాయులకు పాస్‌పోర్ట్‌లు జారీ చేస్తుంది. ఉదాహరణకు బహ్రెయిన్‌లో, తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన ప్రవాస దంపతులకు జన్మించిన ఒక బాలిక జననాన్ని నిర్దిష్ట కాలంలో నమోదు చేయకపోవడంతో అమె భారతీయ పౌరసత్వాన్ని భారత ప్రభుత్వం గుర్తించలేదు. తత్కారణంగా అమెకు పాస్‌పోర్ట్ జారీలో జాప్యం జరిగి, స్వదేశానికి తిరిగి వెళ్ళడంలో ఆ చిన్నారికి సమస్యలు సంభవించాయి. జాతీయతను నిర్ధారించుకున్న తరువాతనే పౌరసత్వాన్ని నమోదు చేసి, పాస్‌పోర్ట్ జారీ చేసే విధానమే ప్రపంచమంతటా అమలులో ఉన్నది. భారత్‌లో సైతం దరఖాస్తుదారుడు భారతీయుడు అని నిర్ధారించుకున్న తర్వాతే పాస్‌పోర్ట్‌ను జారీ చేస్తారు. ఈ నేపథ్యంలో పౌరసత్వానికి పాస్‌పోర్ట్ ప్రమాణం కాదని విదేశాంగ శాఖ అనడం సువిశాల భారతీయ సమాజాన్ని సందిగ్ధావస్థలో పడవేసింది. సమస్త ధ్రువీకరణలలో పాస్‌పోర్ట్‌ను అత్యున్నత విశ్వసనీయ అధికారిక పత్రంగా భావిస్తారు. ఇది, దేశ జనాభాలో కేవలం 6.5శాతం మంది వద్ద మాత్రమే ఉన్నది. అయినప్పటికీ పాస్‌పోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం సహజంగానే అసంఖ్యాకులను ఉలికిపాటుకు గురిచేసింది. జాతీయతను జాతీయ పౌరసత్వ నమోదు (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్-- ఎన్‌ఆర్‌సీ) ద్వారా నిర్ధారిస్తారు. ఇందుకు జాతీయ జననాల నమోదు అవసరం. దురదృష్టవశాత్తు రాజకీయ పార్టీల స్వార్థ ప్రయోజనాల కారణంగా ఈ ప్రక్రియ 2003 వరకు అస్తవ్యస్తంగా కొనసాగింది. కేంద్ర హోం శాఖ పరధిలోని ఈ అంశాన్ని దాని పక్షాన స్థానిక సంస్థలు నిర్వహిస్తాయి. స్థానిక స్వపరిపాలనా సంస్థలలోని ప్రజాప్రతినిధులు ఎప్పుడూ, ఎక్కడా కూడ ఈ విషయమై ప్రజలలో అవగాహన కల్పించలేదు. ప్రభుత్వాలూ సరిగా పట్టించుకోలేదు. జననాల నమోదులో చోటుచేసుకున్న అలసత్వానికి ప్రజల కంటే పాలకులే ప్రథమ దోషులు అని చెప్పక తప్పదు. అయితే రెండు దశాబ్దాల క్రితం ఈ శోచనీయ పరిస్థితి మారింది. నాటి నుంచి జననాల నమోదు క్రమబద్ధంగా జరుగుతోంది. ప్రస్తుత యువతరంలో అత్యధికుల జననం అధికారికంగా నమోదయి ఉంది. అయితే వారి తల్లిదండ్రుల జననాల విషయంలో మాత్రం స్పష్టత లేదు. 1987కు ముందు జన్మించిన వారికి జనన సర్టిఫికెట్లు అవసరం లేదని ప్రభుత్వం చెబుతున్నది. 2004 అనంతరం జన్మించిన వారి జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు తల్లిదండ్రుల సర్టిఫికెట్లను సైతం అడుగుతోంది. దీంతో పరిస్థితి సంక్లిష్టమవుతోంది.

# శ్రీనగర్ కాలనీలో ఘనంగా 'మయూర హాస్పిటల్స్' నూతన బ్రాంచ్ ప్రారంభం

**జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సేవలు అందుబాటులోకి..**

**జూలై 1 నుంచి 5 వరకు రోగులకు ఉచిత కన్సల్టేషన్..**

**మందుల్లేని జీవితమే లక్ష్యంగా 'డేటా డ్రివెన్ హెల్త్‌కేర్': డాక్టర్ హను యెడ్లూరి**



నిర్భయవార్త ప్రతినిధి : శ్రీనగర్ కాలనీ: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీ (కేశవ నగర్)లో 'మయూర హాస్పిటల్స్' నూతన బ్రాంచ్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. అత్యాధునిక సాంకేతికత, ఆయుర్వేద వైద్య విధానాల మేలుకలయికతో 'డేటా డ్రివెన్ హెల్త్‌కేర్'ను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఈ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ హను యెడ్లూరి తెలిపారు. బ్రాంచ్ ప్రారంభోత్సవం సందర్భంగా జూలై 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రోగులకు ఉచిత కన్సల్టేషన్ సేవలు అందించనున్నట్లు డాక్టర్ హను తెలిపారు.

**వ్యాధి మూలాలపై పోరాటం.. రివర్సల్ ప్రోగ్రామ్స్**

ఈ సందర్భంగా డాక్టర్ హను యెడ్లూరి మాట్లాడుతూ.. కేవలం రోగ లక్షణాలను అణచివేస్తూ జీవితకాలం మందులు వాడే విధానానికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. వ్యాధిని మూలాల నుంచి నిర్మూలించడమే తమ ప్రధాన ఉద్దేశమన్నారు. జన్యుపరమైన పరీక్షలు, ల్యాబ్ టెస్టింగ్, స్మార్ట్ రింగ్స్ ద్వారా 24 గంటలు రోగి ఆరోగ్య స్థితిని మానిటర్ చేస్తూ ఈ నూతన విధానంలో చికిత్స అందిస్తామన్నారు. ముఖ్యంగా డయాబెటిస్, హార్ట్ బ్లాక్స్ వంటి సమస్యలకు సర్జరీలు అవసరం లేకుండా 'రివర్సల్ ప్రోగ్రామ్స్' డిజైన్ చేశామని వివరించారు. డయాబెటిస్ విషయంలో కేవలం హెచ్‌బీఏ1సీ లేదా ఫాస్టింగ్ గ్లూకోజ్ తగ్గించడం కాకుండా, గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్ ద్వారా నెగెటివ్ రిపోర్ట్ తీసుకువచ్చి వ్యాధిని పూర్తిగా వెనక్కి పంపుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కీళ్ల నొప్పులు, ఎముకల సమస్యలు సహా దాదాపు 40కి పైగా ఆరోగ్య సమస్యలను మయూర హాస్పిటల్స్ విజయవంతంగా రివర్స్ చేస్తోందన్నారు.

**సామాన్యులకూ అందుబాటులో 'జెనెటిక్ టెస్టింగ్'**

భవిష్యత్తులో వచ్చే జబ్బులను ముందుగానే పసిగట్టి, వాటి బారిన పడకుండా రక్షించే 'ప్రివెంటివ్ కేర్' కోసం స్వదేశీ పరిజ్ఞానంతో ఒక టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌ను నిర్మించినట్లు డాక్టర్ హను తెలిపారు. "కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల విలువ చేసే జెనెటిక్ టెస్టింగ్‌ను మయూర హాస్పిటల్స్‌లో సామాన్యులకు అందుబాటు ధరలోకే తీసుకువచ్చాం. తల్లిదండ్రులు, తాతల నుంచి పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి పొలాలు, ఇళ్లు కాదు.. వారి ఆరోగ్యానికి సంబంధించిన 'జెనెటిక్ బ్లూప్రింట్'. ఇది ప్రతి ఒక్కరి ఇళ్లలో, బ్యాంక్ లాకర్లలో దాచుకోవాల్సిన అత్యంత విలువైన సమాచారం" అని ఆయన ఉద్ఘాటించారు. ఈ రిపోర్ట్ ద్వారా ఏ ఆహారం పడుతుంది, ఏ మందులు పనిచేస్తాయో కచ్చితంగా తెలుసుకోవచ్చని సూచించారు. వయసు పైబడినా ప్రతిరోజూ గుప్పెడు మందులు మింగాల్సిన అవసరం లేకుండా, ఆరోగ్యంగా జీవించవచ్చని నిరూపించడమే మయూర హాస్పిటల్స్ ఆకాంక్ష అని ఆయన అన్నారు. మయూర హాస్పిటల్స్ అన్ని బ్రాంచీలలో (మియాపూర్, దిల్ సుఖ్ నగర్, శ్రీనగర్ కాలనీ) ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 7:00 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నంబర్: 89770 30642 లో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ హను యెడ్లూరి కోరారు.

# సిద్దిపేట సురక్ష నేత్రకు ప్రజల మద్దతు

**100 రోజుల్లో 1000కి పైగా సీసీటీవీలు**

**ఒకే రోజు జిల్లాలో 284 సీసీటీవీ కెమెరాల ప్రారంభం**

**నేరాల నియంత్రణకు సాంకేతికతే కీలకం: సీపీ రష్మి పెరుమాళ్**



నిర్భయవార్త ప్రతినిధి : సిద్దిపేట: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సిద్దిపేట సురక్ష నేత్ర" కార్యక్రమం జిల్లాలో విశేష స్పందన పొందుతోంది. కార్యక్రమం ప్రారంభమైన కేవలం 100 రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా 1000కి పైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలీసు అధికారుల ఆధ్వర్యంలో మొత్తం 284 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. ఇందులో అక్బర్ పేట భూంపల్లి మండలం చౌదర్పల్లె గ్రామంలో 15, సిద్దిపేట రూరల్ మండలం రావురుకుల గ్రామంలో 27, దుబ్బాక మండలం పోతారం గ్రామంలో 32, ములుగు మండలం గంగాధరపల్లి గ్రామంలో 14 సీసీటీవీ కెమెరాలు ప్రారంభించగా, మిగిలిన కెమెరాలను జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. సిద్దిపేట రూరల్ మండలం రావురుకుల గ్రామం, దుబ్బాక మండలం పోతారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాల్లో నేరాల నివారణ, నేరాల ఛేదనలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం 24 గంటలూ నిఘా వ్యవస్థలా పనిచేసే ఈ కెమెరాలు ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు కీలక ఆధారాలను అందిస్తాయని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దొంగతనాల అవకాశాలు కూడా పెరిగే ప్రమాదం ఉందని సీపీ హెచ్చరించారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే మోసగాళ్లను నమ్మవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అపరిచితుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఆర్థిక మోసాలకు గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

**గంగాధరపల్లిలో 14 కెమెరాల ప్రారంభం**

అక్బర్ పేట భూంపల్లి మండలం చౌదర్పల్లె గ్రామంలో భూంపల్లి పోలీసులు ప్రారంభించారు, ములుగు మండలం గంగాధరపల్లి గ్రామంలో యూనిక్ బయోటెక్ యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన 14 సీసీటీవీ కెమెరాలను సిద్దిపేట అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు పోలీసులకు "మూడో కన్ను"గా పనిచేస్తూ నేరస్థులను త్వరగా గుర్తించి పట్టుకోవడంలో కీలకంగా ఉపయోగపడతాయని అన్నారు. గ్రామ భద్రత కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కెమెరాలు ఏర్పాటు చేసిన గంగాధరపల్లి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులను ఆయన అభినందించారు. జిల్లాలోని ఇతర గ్రామాలు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు వచ్చి తమ గ్రామాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**పాల్గొన్న అధికారులు**

రావురుకుల, పోతారం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సిద్దిపేట ఏసీపీ రవీందర్, రూరల్ సీఐ విద్యాసాగర్, సీఐ వాసుదేవరావు, ఎస్‌ఐలు నవత, కీర్తిరాజు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గంగాధరపల్లి కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, ములుగు ఎస్‌ఐ రఘుపతి, గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, ఉపసర్పంచ్ సుదర్శన్, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు హాజరయ్యారు. ప్రజల సహకారం - పోలీసుల సాంకేతిక చర్యలు కలిసి సిద్దిపేట జిల్లాను మరింత సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దే దిశగా "సిద్దిపేట సురక్ష నేత్ర" కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతోంది.



# చరిత్ర పుటల్లోకి ఉపాధి హామీ పథకం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం 40 శాతం నిధులను భరించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్రంపై అదనపు భారం పడుతుందని పలు రాష్ట్రాలు ఈ కొత్త చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.నిపలు రాష్ట్రాలు అభ్యంతరం:నినికేంద్రం తీసుకువచ్చిన ఈ'వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్' పథకంపై తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ పథకాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం సైతం చేసింది. ఈ పథకంలో చేరాలా వద్దా అనే దానిపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన ప్రభుత్వం గురువారం జరగబోయే రాష్ట్ర కేబినెట్ లో సమగ్రంచా చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం తెలిపింది.

## హైదరాబాద్‌లో ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్..

(మొదటి పేజీ తరువాయి)

సిగ్నల్స్‌ను ఒకే గొడుగు కిందికి తెస్తూ ఇంటిగ్రేట్ చేయాలని, రోడ్లపై ఉండే రద్దీకి అనుగుణంగానే సిగ్నల్స్ ఆటోమెటిక్‌గా పనిచేసేలా చూడాలన్నారు. ముఖ్యంగా వాతావరణ మార్పులు, భారీ వర్షాల వంటి అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా క్రమబద్ధీకరించేందుకు ఈ వ్యవస్థను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత విముక్తి..

(మొదటి పేజీ తరువాయి)

దీంతో వెస్ట్ ఢిల్లీ, గురుగ్రామ్ నుంచి సౌత్, ఈస్ట్ ఢిల్లీ వైపు వెళ్లే వారికి ప్రయాణ సమయం బాగా కలిసి రానుంది.నిరిడ్జ్ అడవులకు లేదు.. ఢోకానినిఢిల్లీకి ఊపిరితిత్తులు లాంటి సదరన్ రిడ్జ్ అడవులకు ఎటువంటి నష్టం వాటిల్లకూడదని ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అందుకే ఈ టన్నెల్‌ను అడవికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పూర్తిగా భూగర్భం గుండా నిర్మిస్తామని మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులో దాదాపు 3.14 కిలో మీటర్ల మేర ట్విన్-ట్యూబ్ అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉండనుంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రాబోయే ఐదేళ్లలో ఇది పూర్తి కానుంది. అదేవిధంగా ఢిల్లీ ప్రాజెక్టుతో పాటు, ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో కనెక్టివిటీని పెంచేందుకు రూ.7,145 కోట్లతో కాన్పూర్ - కబ్రాయ్ హైవే ప్రాజెక్టుకు కూడా క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవే కాకుండా దేశంలోని 57 కీలక రైల్వే ప్రాజెక్టులకు రూ.2.60 లక్షల కోట్లు, ప్రధాన నగరాల్లో 12 కొత్త మెట్రో ప్రాజెక్టులు రూ.1.50 లక్షల కోట్లు, ఓడరేవుల ఆధునీకరణ, షిప్ రిపేర్ సదుపాయాలు, నౌకాయాన సంస్కరణల కోసం సుమారు రూ.1.50 లక్షల కోట్లు, చివరగా 5 కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంతో పాటు రూ.37,000 కోట్లతో 'ఉడాన్' పథకాన్ని విస్తరించబోతున్నారు.

# తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టొద్దు..

(మొదటి పేజీ తరువాయి)

సాకారం అయిందని చెప్పారు. నిన్నే సీఎం రేవంత్ రైతు భరోసా విడుదల చేశారని తెలంగాణ ప్రజలా గుండెల్లో కాంగ్రెస్ పార్టీ శాశ్వతంగా ఉండిపోతుందన్నారు. బీజేపీ చెబుతున్న వికసిత్ భారత్‌లో తెలంగాణ లేదా? రెండు కోట్ల ఉద్యోగాలు పేరిట మోసం చేయలేదా? అని నిలదీశారు. సంపన్న వర్గం కోసమే కేంద్రం పని చేస్తోందని అయోధ్య దోపిడి గురించి, కాళేశ్వరం స్కామ్ పై సీబీఐ దర్యాప్తు పై నబీన్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణలో మత వైషమ్యాలకు తావులేదని మత చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తే సాధ్యం కాదన్నారు. మత సామరస్యానికి ప్రతీక తెలంగాణ అన్నారు. బీహార్‌లో ఓటు దొంగిలిస్తే మీనాక్షి నటరాజన్ విషయంలో ఏకంగా సీటు చోరీ చేశారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. సర్ కార్యక్రమం ఓట్ల జత కోసం అయితే అది కాస్త ఇపుడు ఓట్ల తొలగింపు కార్యక్రమంలా మారిందన్నారు. సీబీఐ, ఈడీ, ఎలక్షన్ కమిషన్?ను గుప్పిట్లో పెట్టుకొని బీజేపీ అనుబంధ సంస్థలా వాడుకుంటున్నారని ఎలక్షన్ కమిషన్ చేతిలోకి తీసుకోని రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. విభజన హామీలు నెరవేస్తారని, సందేశం ఇస్తారని ఆశిస్తే విష బీజం వేశారని బీజేపీ ముసుగులో ఇతర పార్టీలు రెచ్చగొట్టినా కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి డొకా లేదన్నారు.

**టెంపరరీ గోల్స్ మాత్రమే రీచ్:**

కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఫామ్ హౌస్‌కు పరిమితం అయ్యారని బావ, బామ్మర్దులు మాపై విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రజలు మా పార్టీ వైపు ఉన్నారని, మా ప్రభుత్వం వచ్చాక 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. జాతీయ అధ్యక్షుడు వస్తే పట్టుమని 2 వేల మందిని కూడా పోగు చేసుకోలేని పార్టీ బీజేపీ అన్నారు. పేద ప్రజలకు మోడీ ప్రభుత్వం ఇచ్చింది ఏమి లేదు 90 శాతం ప్రతిపక్ష నాయకుల మీద జుణ, దాడులు చేయించారు. సీబీఐ, ఈడీలను అడ్డుపెట్టుకుని కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ నాయకులు టెంపరరీ గోల్స్ మాత్రమే రీచ్ అవుతారని బీజేపీతో పాటు ఎన్ని పార్టీలు కలసి పోటీ చేసిన కాంగ్రెస్‌ను ఢీ కొట్టలేరని ధీమా వ్యక్తం చేశారు.


# సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

నిర్భయవార్త ప్రతినిధి :వేములవాడ: వేములవాడ రూరల్,ప్రభుత్వ పాఠశాల రాజా నగర్ లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలుస్తూ, సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పలకలు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు తెలిపారు. వేములవాడ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఈ సహాయ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పిల్లి బాబురావు మాట్లాడుతూ, ట్రస్ట్ స్థాపన నుంచి విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ పేదప్రజలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్య సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం కల్పించడం తమప్రధానలక్ష్యమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, అవసరమైన వారికి సహాయం అందించేందుకు ట్రస్ట్ కట్టుబడిఉందనితెలిపారు.సమాజంలోని దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే మరింత మంది విద్యార్థులకు తోడ్పాటు అందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి దాతలు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,తోట రాజు,వస్తాద్ కృష్ణ,దినేష్ గౌడ్ ,దీపక్ రెడ్డి , పూరెల్ల గంగాధర్, రేగుల రాజేందర్, కొండాసాని రాజేష్ గార్లు ఆర్థిక సహాయం అందించి ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు మద్దతు తెలిపినట్లు నిర్వాహకులు తెలిపారు. వారి సహకారంతో త్వరలోనే ఇంకా పెద్ద ఎత్తున నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ స్థాపకులు ఎద్దండి రాజు, వేములవాడ రూరల్ మండలం విద్యాధికారి లోకిని కిషన్ సార్, రాజా నగర్ పాఠశాలప్రధానోపాధ్యాయులు రాజు,మేడం వకుళ, ట్రస్ట్ సభ్యులు దూలం భూమేష్ గౌడ్ , ఆకులేశు రెడ్డి,వాసాల హరిప్రసాద్, గోటే నవీన్, సాయి కళ్యాణ్ తదితరులు పాల్గొననున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.





## శ్రీ కోట మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న ఐ.ఏ.ఎస్.



సింగరేణి జులై 1 నిర్భయవార్త రిపోర్టర్.సింగరేణి మండల పరిధిలోని కోరిన కోరికలు తీర్చే శ్రీ కోట మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు బుధవారం అడిషనల్ చీఫ్ ఎలక్ట్రోలర్ ఆఫీసర్ ఐ.ఏ.ఎస్ వాసం వెంకటేశ్వర రెడ్డి అమ్మవారిని ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ అర్చకులు కైలాసశర్మ , జూనియర్ అసిస్టెంట్ మోహన్ కృష్ణ ఘన స్వాగతం పలికి శాలువా సత్కరించి పూజలు నిర్వహించారు. వారి వెంట ఇల్లందు మున్సిపల్ కమిషనర్ సందీప్, ఇల్లందు తహసిల్దార్ కాశీం పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాలలో నియమకాలు ఎప్పుడు




జులై 1 (నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి: 2026-27 విద్యా సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలో 132 ప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యాయి! ఎల్కేజీ అడ్మిషన్లు కూడా ప్రారంభించారు. అయితే బోధన కోసం ఇన్స్ట్రక్టర్ ఆయా నియామక ప్రక్రియ జూన్ 13 వరకు దరఖాస్తు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎంపిక చేపట్టలేదు దీంతో ప్రీ ప్రైమరీ విద్యార్థుల బోధనపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం అవుతుంది.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం



జులై 1 (నిర్భయవార్త)జిల్లా ప్రతినిధి: 2027 -28 విద్యా సంవత్సరానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కోసం అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులు హెచ్టిటిపి:/తెలంగాణ ఈపాస్.సి.జి.జి గవర్నమెంట్.ఇన్ వెబ్సైట్ ద్వారా ఆగస్టు 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.విదేశీ విద్య అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

## విబిజీ రాంజీ చట్టం రద్దు చేయాలి: సిపిఐ డిమాండ్

జులై 1 (నిర్భయవార్త)జిల్లా ప్రతినిధి :జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని వీ.ఐ.జీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్ బుధవారం నాడు డిమాండ్ చేశారు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు “ భూధాన్ భూముల పట్టాలను పేదలకె ఇవ్వాలని,కోరుతూ లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



## మహిళల ఆర్థిక సాధికారతకు ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరం ప్రారంభించిన. మంత్రి సీతక్క

ములుగు జూలై 01, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు జిల్లా కేంద్రంలో మదర్ ఎడ్యుకేషన్ , రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపకురాలు బొజ్జ సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలంటే నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని అన్నారు. ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తూ ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. అలాంటి కార్యక్రమాల్లో భాగంగానే మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ అందించడం ద్వారా వారు స్వశక్తితో ఉపాధి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమం 45 రోజుల పాటు కొనసాగుతుందని, శిక్షణ పూర్తిచేసిన ప్రతి శిక్షణార్థికి సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. టైలరింగ్ రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి ప్రారంభించి కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా మరింత బలంగా ఎదగవచ్చని మంత్రి సూచించారు. ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో , ములుగు మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ , మదర్ ఎడ్యుకేషన్ , రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## ఓటర్ల జాబితా సవరణ పై బి.ఎల్.ఎలు అప్రమత్తంగా ఉండాలి: నీలం మధు

**పటాన్ చెరులో ఏస్ ఐ ఆర్ పై అవగాహన సదస్సు..**

**ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి..**

జూలై 1(నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి :ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కు నమోదు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రామచంద్రపురం బాలాజీ గార్డెన్స్ లో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముసాయిదా సవరణ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై, సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా మార్పులు చేర్పులు జరగాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించే క్రమంలో పొరపాట్లు జరగకుండా చూసే బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్ల పై ఉందన్నారు. మరణించిన వారి పేర్లు, ఒకే పేరుతో రెండు చోట్ల ఉన్న బోగస్ ఓట్లను గుర్తించి జాబితాను ప్రక్షాళన చేయాలని అధికారులకు, ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చొరవ చూపాలని పిలుపునిచ్చారు.అనంతరం నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ 'ఎస్ ఐ ఆర్' ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలని, ఇందులో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో బి.ఎల్.ఓలతో సమన్వయం చేసుకుంటూ, అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులను కోరారు. ప్రజల్లో కూడా ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించి, తమ ఓటు వివరాలను సరిచూసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.ఈ అవగాహన సదస్సులో ఎస్ ఐ ఆర్ ఫారాల భర్తీ, ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ దరఖాస్తుల పరిశీలన, తదితర సాంకేతిక అంశాలపై ప్రతినిధులకు సమగ్రంగా వివరించారు ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ వెన్నెల, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ గాలి అనిల్ కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కాట సుధా, కార్పొరేటర్ పుష్ప నగేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు తదితరులు పాల్గొన్నారు..



## సీతారాంపురం గ్రామానికి రోడ్డు నిర్మాణానికై సిపిఎం ప్రదర్శన

**కర్రెగుట్టలలో రోడ్ల నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు ఎలా అనుమతులు**

ములుగు జూలై01, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని మారుమూల గ్రామమైన సీతారాంపురం గ్రామానికి రోడ్డు, వాగులపై వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీతారాంపురం పార్టీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ సెంటర్ నుండి బస్టాండ్ మీదుగా తాసిల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు అనంతరం తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతాలకు కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పే మాట ఎంత నిజమో సీతారాంపురం గ్రామ పరిస్థితి చూస్తే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు 50 సంవత్సరాలు పైగా 70 ఆదివాసీ కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామానికి రోడ్ల సౌకర్యం లేకపోవడం, పూసు వాగు, ఓటిగుంట వాగుల వంతెన లేకపోవడం వర్షాకాలంలో ప్రజల కష్టాలు వర్ణనాతీతం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు 6 కిలోమీటర్ల రోడ్డుకు, రెండు వంతెనల నిర్మాణానికిళప్రభుత్వం దగ్గర నిధులు లేవని ప్రశ్నించారు రోడ్ల నిర్మాణానికి ఫారెస్ట్ డిపార్టుమెంటును అడ్డుగా చూయించటం సరైనది కాదని అన్నారు కర్రెగుట్టలలో రోడ్ల నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు ఎలాగైతే అనుమతులు ఇచ్చారు, సీతారాంపురం గ్రామానికి రోడ్డు నిర్మాణానికి అలాగే అనుమతిలిచ్చి తిరిగిన ప్రజల వ్యాధులను అర్థం చేసుకోవాలని డిమాండ్ చేశారు రోడ్డు సౌకర్యాలు లేక, వర్షాకాలంలో వాగులు పొంగి, ప్రజలు అనారోగ్య సమస్యలతో చనిపోయిన సందర్భాన్ని గుర్తు చేశారు ఎమ్మెల్యే వెంకట్రావు ఆదివాసి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు, రోడ్డు, వంతెల్ల నిర్మాణం పూర్తయ్య వరకు పోరాటాలు ఉద్యమాలు సాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు, జిల్లా కమిటీ సభ్యులు వంకా రాములు, కట్ల నరసింహాచారి, మండల కమిటీ సభ్యులు కాపుల వెంకటేశ్వర్లు, కంటి వెంకయ్య, కంతం సత్యం, గొంది రమణయ్య, గ్రామస్తులు కురుసం మల్లయ్య, మేడం నగేష్, శంకరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఐఏఎస్ అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనింగ్.

**కళాశాల వసతులపై ఆరా.**



సింగరేణి జులై 1 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఫారెస్ట్ కుమార్ ఐఏఎస్ అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనింగ్ కళాశాలను బుధవారం సందర్శించారు. గత సంవత్సరం అడ్మిషన్, ఫలితాల పై ప్రిన్సిపాల్ విజయకుమార్ ని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 23 కళాశాలలో గత సంవత్సరం రిజల్ట్ లో మొదటి స్థానం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందంజలో ఉండడంతో అభినందించారు. అలాగే ఈ ఏడాది మొదటి సంవత్సరం 180 అడ్మిషన్లు నమోదు అయినందుకు అభినందించడం జరిగింది. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైనర్ రిపేర్ లపై ఆరా తీశారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సాధించి గతం కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించడం కోసం అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. సకల వసతులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చొరవ తీసుకోవాలని తెలిపారు. తరగతి గదులు, లైబ్రరీ గదిలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల ఎంపీఓ రవీందర్ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణయ్య, హౌసింగ్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ వైద్య దినోత్సవం సందర్భంగా డాక్టర్లకు సన్మానం



జులై 1 (నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి: గుమ్మడిదల మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలో పలు ఆర్ఎంపీ డాక్టర్లు కలిసి వారి,వారిని సన్మానించుకుంటూ అలాగే ప్రభుత్వ డాక్టర్లను గుర్తించి ప్రపంచ వైద్య దినోత్సవం సందర్భంగా బుధవారం నాడు డాక్టర్లను సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి ఆరోగ్యంగా జీవనం కొనసాగించాలి అంటే వారిని వివిధ ఆరోగ్య సమస్యల నుంచి పరిష్కారం చూపే వైద్యుడు భగవంతుడితో సమానమని, వైద్యం అంటే వృత్తి కాకుండా మనుషులను బతికించే మహాశక్తిగా భావించే ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులను గుర్తించే రోజు ప్రపంచ వైద్య దినోత్సవం అని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ మధుకర్, ఆర్.ఎం.పి డాక్టర్లు గణేష్ ఆనంద్,అప్పారావు, శ్రీనివాస్, సాగర్ తదిరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి మంత్రి సీతక్క



ములుగు జూలై 01 ( నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ , బీఎల్ఏ ల అవగాహన సదస్సుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రతి బీఎల్ఏ తన పరిధిలోని బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను నిరంతరం పరిశీలిస్తూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను నిశితంగా గమనించాలని అన్నారు.గణన ఫారాలు, దరఖాస్తుల నింపే విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు కూడా సరైన సమాచారం అందిస్తూ సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలని మంత్రి పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## దుర్గమ్మనుదర్శించుకున్న రాష్ట్రదేవాదాయ శాఖసెక్రటరీగానియమితులైన కె. కన్నబాబు



నిర్భయవార్త ప్రతినిధి :ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఇంద్రకీలాద్రి కి.రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీగా నియమితులైన కె. కన్నబాబుఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారినిదర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో దేవస్థానం అర్చక బృందం స్వాగతం పలికిన అనంతరం, వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను కన్నబాబుకి అందజేశారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో పాల్గొన్న. ఎంపీ..కేశినేని శివానాద్ చిన్ని





నిర్భయవార్త ప్రతినిధి : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చి మనియోజకవర్గం..ఎప్పటిలాగే ఒకటో తేదీ రాగానే కూటమి ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసాలి పెన్షన్ పంపిణీలో. పార్లమెంట్ సభ్యులు కేశినేని శివానాద్ చిన్ని పెన్షన్ పంపిణీ కార్యక్రమం లో పాల్గొని పెన్షన్ దారులను కలిసి వారి సమస్యలు తెలుసుకుని మీకు పెన్షన్ పరంగా, ఆరోగ్యం మరియు స్థానిక సమస్యలు ఏమున్న తన దృష్టికి తీసుకు రావాలని వాటిని తక్షణమే పరిష్కృతమయ్యేలా తాను తన తోటి నాయకులు,తన సిబ్బంది కృషి చేస్తారని అన్నారు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం చాలా గొప్ప కార్యక్రమం అని ఇక్కడికి వచ్చి ఇలావీళ్ళని కలిసి ఈ పెన్షన్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఇక మీదట కూడాఈ నియోజకవర్గంలోనే మరిన్ని కార్యక్రమాలు రూపుదిద్దే విధంగా ఆలోచిస్తున్నామని.కూటమి పాలనలోనే పశ్చిమ నియోజకవర్గం యొక్క రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వర్ రావు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సుఖాసీ కిరణ్ కుమార్,బంకనాగమణి,కుంచెం దుర్గారావు, బెవర రవి కుమార్,దుర్గ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు సుఖాసీ సరిత,మరియు కూటమి పార్టీ.నాయకులు. కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు..

## హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వం.

### లబ్ధిదారులకు ఇంటింటా పెన్షన్లు.

బుచ్చిరెడ్డిపాలెం, నిర్భయవార్త ప్రతినిధి :బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని నాలుగో వార్డులో బుధవారం సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిఒచారు. వార్డు ఇన్‌చార్జి మహీంధర్ నాధరెడ్డి, 43వ బూత్ ఇన్‌చార్జి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చినబాబు




ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహీంధర్ నాధరెడ్డి, మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెలా ఒకటో తేదీన అర్హులైన లబ్ధిదారులకు రూ.4,000 సామాజిక భద్రతా పింఛన్ అందిస్తున్నారని తెలిపారు.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అలాగే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# బుచ్చి జనసేన అధ్యక్ష పదవికి హాట్ రేస్..!

**ఐదుగురు ఆశావహులు..**
**ఇప్పటికే నాలుగు దరఖాస్తులు..!**
**పాత-కొత్త తరాల నాయకుల మధ్య పోటీ..**
**స్థానిక ఎన్నికల వేళ రాజకీయ వేడి..!**

బుచ్చిరెడ్డిపాళెం, నిర్భయవార్త ప్రతినిధి ;:.స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న వేళ బుచ్చిరెడ్డిపాళెం జనసేన పార్టీ అధ్యక్ష పదవికి పోటీ ఆసక్తికరంగా మారింది. పార్టీ సంస్థాగత బలోపేతానికి అధిష్ఠానం కసరత్తు ప్రారంభించడంతో అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ఐదుగురు నాయకులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఇప్పటికే నలుగురు ఆశావహులు అధికారికంగా




దరఖాస్తులు సమర్పించినట్లు సమాచారం. మరో కీలక నేత కూడా దరఖాస్తు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో అధ్యక్ష పదవి కోసం పోటీ ఉత్కంఠభరితంగా మారింది.ఈ రేసులో పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్ నాయకులతో పాటు ఇటీవల పార్టీలో చురుకుగా వ్యవహరిస్తున్న యువ నాయకులు కూడా ఉండటం విశేషం. అనుభవానికి ప్రాధాన్యం ఇవ్వాలా..? లేక యువ నాయకత్వానికి అవకాశం కల్పించాలా..? అనే అంశంపై పార్టీ శ్రేణుల్లో విస్తృత చర్చ జరుగుతోంది.స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బలమైన నాయకత్వాన్ని ఎంపిక చేయాలని జనసేన అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల్లో సమర్థవంతంగా ముందుకు నడిపించే నాయకుడికే బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అధ్యక్ష పదవి ఎవరిని వరించనుంది..? పాతతరానికి పట్టం కడతారా..? కొత్త తరానికి అవకాశం ఇస్తారా..? అనే ఉత్కంఠ బుచ్చి రాజకీయ వర్గాల్లో రోజురోజుకూ పెరుగుతోంది. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపై జనసేన శ్రేణులతో పాటు ఇతర రాజకీయ పార్టీలూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## దివంగత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిల్ల తిరుమలేశ్వర్ రావుగారి 61వ జయంతి.

### విజయవాడలోని ఎస్‌కేపీవీవీ హైస్కూల్లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు.



అమరావతి, నిర్భయవార్త ప్రతినిధి : విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేసినేని చిన్నీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌కేపీవీవీ హైస్కూల్‌కు చెందిన సుమారు 600 మంది విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులకు కలిపి మొత్తం 2,000 మందికి నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, ఎరేజర్లు, షార్ప్‌నర్లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేసినేని చిన్నీ మాట్లాడుతూ, మరుపిల్ల తిరుమలేశ్వర్ రావు ప్రజాసేవకు, పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని అన్నారు. ఆయన లేకపోవడం పార్టీకి, కార్యకర్తలకు, అభిమానులకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు బుద్ధా వెంకన్న , దివంగత మరుపిల్ల తిరుమలేశ్వర్ రావుగారి సోదరులు మరుపిల్ల యల్లాజీ, మరుపిల్ల శ్రీనివాసరావు, మరుపిల్ల రవి, పిల్ల శ్రీనివాసరావు, బంక నాగమణి, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు సుకాసి కిరణ్, బేవర్ సాయి సుధాకర్, కరణం దివాకర్, మాధవ్, బంక సురేష్, నాగు, కులపెద్దలు, పార్టీ నాయకులు, అభిమానులు, స్నేహితులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో దాడి మురళి విశేష సహాయ సహకారాలు అందించగా, నిర్వాహకులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దివంగత మరుపిల్ల తిరుమలేశ్వర్ రావు సేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

## ఇంటి వద్దకే పింఛన్లు..

### లబ్ధిదారుల్లో ఆనందం.

### చందాపురంలో ఇంటింటికీ పంపిణీ చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.



నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి :అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు సామాజిక భద్రతా పింఛన్లను ఇంటి వద్దకే అందజేస్తూ నందిగామ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య బుధవారం నందిగామ మండలం చందాపురం గ్రామంలో పింఛన్ల పంపిణీ నిర్వహించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లుఅందజేసిన ఆమె, వారి ఆరోగ్యపరిస్థితులు, కుటుంబ సంక్షేమం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్యమాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రతి నెలఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు అందించే విధానాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి పూర్తిగా ముగింపు పలికామనిచెప్పారు.రాష్ట్రంలో అమలవుతున్న పింఛన్ల పంపిణీ విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. పారదర్శకత,జవాబుదారీతనం, మానవీయ దృక్పథంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరుతున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, సొసైటీ చైర్మన్లు, కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళపై దాడి అమానుషం...

### మేడా వెంకటేశ్వరరావు.



తాడేపల్లి, నిర్భయవార్త ప్రతినిధి ;: నెల్లూరు జిల్లా కావాలిలో ఓ మహిళను నడిరోడ్డుపైకి ఈడ్చుకొచ్చి అవమనిస్తూ దాడి చేయడం అమానుషమని వైస్సార్సీపీ గుంటూరుజిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు మేడా.వెంకటేశ్వరరావు అన్నారు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూఈ ఘటనపై పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా నిసఫాక్షపాతంగా దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో మహిళలపై వరుసగా జరుగుతున్న ఇటువంటి ఘటనలు భయాందోళనలు కలిగిస్తున్నాయన్నారు బాధితురాలుకి న్యాయం జరిగే వరకు వైస్సార్సీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## శ్రీకొలను గిరిజన కాలనీలో మంత్రి ఆనం చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ.

శ్రీకొలను, నిర్భయవార్త ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి బుధవారం ఏఎస్ పేట మండలం శ్రీకొలను గిరిజన కాలనీలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జరిగిన సభలో లబ్ధిదారులతో మాట్లాడిన మంత్రి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. శ్రీకొలను గ్రామపంచాయతీ పరిధిలో 305 మందికి రూ.12.86 లక్షలు, ఆత్మకూరు నియోజకవర్గంలో 36,354 మందికి రూ.16.22 కోట్లకు పైగా, నెల్లూరు జిల్లాలో 2.87 లక్షల మందికి రూ.127.23 కోట్లకు పైగా పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా, ఏఎస్ పేట మండలానికి చెందిన మూడు కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గత రెండేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గంలో 876 కుటుంబాలకు రూ.8.19 కోట్లకు పైగా సీఎంఆర్‌ఎఫ్ సాయం అందించామని మంత్రి వెల్లడించారు.

## అధైర్యా పడొద్దు ప్రతి కార్యకర్త కుటుంబానికి బిఆర్ఎస్ భరోసా

### తండ్రిని కోల్పోయి పిల్లలకు అండగా వెంకటాపురం మండల బిఆర్ఎస్ పార్టీ గోడవర్తి నర్సింమూర్తి



ములుగు జూలై 01 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రామచంద్రపురం గ్రామంలో గత రెండు రోజుల క్రితం అనారోగ్య సమస్య తో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు సబక రామారావు చనిపోయారు. వారికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ ఖర్చుల నిమత్తం 10000 వేల రూపాయలు. ఆర్థిక సహాయం అందజేసారు. నీరుపేద కుటుంబాలను బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త లను కంటికి రెప్పలా ఆర్థికపరంగా అండగా ఉంటామని వెంకటాపురం పార్టీ సీనియర్ నాయకులు గోడవర్తి నర్సింమూర్తి తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ సభ్యులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం వివేక్. బొల్లిన నర్సింమూర్తి. అట్లూరి రఘురామ్. కానిబెల్లి శివాజీ. సమ్మయ్య. యలమటి శ్రీను. మంచర్ల నాగేశ్వరావు. బట్ట నాగేందర్. పోడెం సురేష్. . గ్రామస్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మృతుల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించిన





ములుగు జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

ములుగు జూలై 01, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఇటీవల మరణించిన పలువురు మృతుల కుటుంబ సభ్యులను ప్రత్యక్షంగా కలిసి, వారిని ములుగు జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబుపరామర్శించారు. ఈ సందర్భంగా తీవ్ర దుఃఖంలో ఉన్న ఆయా కుటుంబాలకు ఆయన తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేసి ధైర్యం చెప్పారు మరణించిన వావిలాల గౌరమ్మ , కునారపు పుల్లమ్మ , డేగ నరేంద్ర వారి నివాసాలకు లక్ష్మణ్ బాబు నేరుగా వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. అధైర్యపడకుండా ఉండాలని, భవిష్యత్తులోనూ వీరికి ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో లక్ష్మణ్ బాబు వారి వెంట స్థానిక ప్రముఖులు, గ్రామ పెద్దలు బీఆర్ఎస్ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యానికి సరిహద్దులు లేవని చాటిచెబుతోంది!

షైనీ విజయవాడలో పుట్టి పెరిగారు. సుదర్శన్, జలజ ఆమె తల్లిదండ్రులు. పటమట ఎన్ఎస్ఎం స్కూల్లో విద్యాభ్యాసం చేశారు. వెల్లూరు సీఎంసీ కళాశాలలో 2009లో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. శిక్షణా కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేయడంలో భాగంగా యువత ఎక్కువగా ఎంచుకోని ఆస్పత్రికి వెళ్లి ఆమె వైద్య సేవలు చేశారు. అలహాబాద్ కుష్ఠురోగ ఆస్పత్రిలో ఆమె చేసిన వైద్యం ఎందరో రోగులకు వ్యాధి నుంచి ఉపశమనం కలిగించింది. జనరల్ ఫిజీషియన్‌గా తనకున్న అనుభవాన్ని మరింతమంది రోగులకు అందించేలా దేశంలోనో, రాష్ట్రంలోనో ఏదేని ఆస్పత్రిలో వైద్యవృత్తిలో షైనీ స్థిరపడవచ్చు. కానీ 'డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్' తరపున సరిహద్దుల ఆవల రోగులకు సేవ చేస్తున్న డాక్టర్ల గురించి తెలుసుకుని ఆమె ఎంతో ప్రభావితమయ్యారు. తాను కూడా ఆ మార్గంలో నడిచి మరింతమందికి సేవ చేయాలని అనుకున్నారు.

'డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్' (ఎంఎస్ఎఫ్) అనేది ఒక స్వతంత్ర అంతర్జాతీయ మానవతావాద సంస్థ. ఈ సంస్థ 60కి పైగా దేశాల్లో సాయుధ సంఘర్షణలు, అంటువ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, మానవ కల్పిత విపత్తులు లేదా ఆరోగ్య సంరక్షణ సేవలకు దూరమైన ప్రజలకు అత్యవసర వైద్య సహాయాన్ని అందిస్తుంది. ఈ సంస్థ 25 వేల మందికి పైగా స్థానిక సిబ్బందితో కలిసి పనిచేయడానికి 3 వేల మందికి పైగా వైద్యులు, నర్సులు, లాజిస్టిక్స్ నిపుణులు, నీరు, పారిశుధ్య నిపుణులు, నిర్వాహకులు, ఇతర వృత్తి నిపుణులతో కలిసి వివిధ దేశాల్లో సేవలు అందిస్తోంది.

**డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్‌తో ప్రయాణం...**

2013 నుండి షైనీ ఈ సంస్థ తరపున వైద్య సేవలు చేశారు. మొట్టమొదటి ప్రాజెక్టు ఇథియోపియా–సోమాలియా సరిహద్దు ప్రాంతంలో నిర్వహించారు. అది అంతర్యుద్ధ ప్రాంతం. 2015లో యెమెన్‌లో కలరా తీవ్రంగా ప్రబలినప్పుడు అక్కడ విధులు నిర్వర్తించారు. ఆ తరువాత నైజీరియాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు, సబ్ సహారా ఆఫ్రికాలో ఎడారి మధ్యలో ఓ గుడారంలో షెల్టర్ తీసుకుని వైద్య సేవలు అందించడం... ఇలా చాలా అనుభవాలు షైనీ ప్రయాణంలో ఉన్నాయి. "జీవితంలో ఒక్కసారి కూడా వైద్యుడిని చూడని అరుదైన ప్రాంతానికి వెళ్లి సేవలు చేశాను" అని షైనీ చెప్పారు. బాంబు దాడులు జరుగుతున్నప్పుడు బంకర్లలోకి వెళ్లి ప్రజలు తలదాచుకోవడం, గట్టిగా ఏ శబ్దం వినిపించినా భయంతో వణికిపోయే



జనాలకు ఆమె వైద్యంతో పాటు మనోనిబ్బరం కూడా కల్పించేవారు. తనకు ఎదురైన అనుభవాలను ఆమె ఇలా చెప్పారు.

"ఒకసారి 70 ఏళ్లు పైబడిన ఓ మహిళ హెల్త్ సెంటర్‌కు వచ్చింది. తను నడుం నొప్పితో బాధపడుతోంది. కారణం ఏంటని నేను ట్రాన్స్‌లేటర్ సాయంతో అడిగాను. 50 ఏళ్ల తన కొడుకు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని, తనను చూసుకోవడానికి ఎవరూ లేరని చెప్పింది. మిలిటెంట్లు దాడులు చేసినప్పుడు బంకర్‌లోకి వెళ్లి తలదాచుకోవడానికి నడవలేని స్థితిలో ఉన్న కొడుకుని వీపుపై వేసుకుని కిందకు వెళ్లడం చాలా కష్టంగా ఉందని, ఆ సమయంలో నడుం తీవ్రంగా నొప్పి పుడుతుందని ఆమె చెబుతున్నప్పుడు నాకు కళ్ల నుంచి ధారాళంగా నీళ్లు వచ్చాయి. ఆ ముసలావిడకు పెయిన్ కిల్లర్స్ ఇవ్వడం తప్ప నేను ఏమీ చేయలేకపోయాను. దాడులు అమాయకులను ఎంతలా ప్రభావితం చేస్తాయో అనడానికి ఈ ఘటనే ఉదాహరణ" అని షైనీ తనకెదురైన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు.

పోషకాహార లోపం ఉంటే సరైన ఆహారం తీసుకుంటే సరిపోతుందని అనుకుంటాం. కానీ తనకెదురైన ఓ అనుభవాన్ని షైనీ ఇలా చెప్పారు. "నేను వెళ్లిన దేశాల్లో చాలా చోట్ల పోషకాహార లోపంతో పిల్లలు చనిపోయేవాళ్లు. దానికి ప్రత్యేక వైద్యం ఉందని నాకు అక్కడికి వెళ్లాకే తెలిసింది. మందులు, పాలు, ఆహారం అన్నీ ప్రత్యేకంగానే ఇచ్చేవాళ్లం. మలేరియా కూడా చాలా ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలను తీస్తుంది. కోవిడ్ టైంలో దక్షిణ ఆఫ్రికాలో ఓ మారుమూల ప్రాంతంలో సేవలు అందించాను. అప్పుడు స్థానిక ఆస్పత్రులకు వెళ్లి డాక్టర్లకు, నర్సులకు వైరస్ పట్ల అవగాహన కల్పించేదాన్ని. నేను ప్రత్యక్షంగా వెళ్లలేని చోటుకు ఆ డాక్టర్ల ద్వారా వైద్యం అందుతుందని సంతోషపడేదాన్ని" అని ఆ రోజులను ఆమె గుర్తు చేసుకున్నారు.

యుద్ధాల్లో మహిళలు, పిల్లలు ఎంతలా బలవుతున్నారో అనడానికి షైనీ చెప్పిన ఈ ఘటన అద్దం పడుతుంది. "విధుల్లో ఉన్నప్పుడు అర్ధరాత్రుళ్లు కూడా నాకు ఫోన్లు వచ్చేవి. ఎప్పుడైనా మెటర్నిటీ వార్డుకు రావాలి అని ఫోన్ వస్తే... 'రేప్ కేసా, డెలివరీ కేసా?' అని అడిగేదాన్ని. అక్కడ అలాంటివి సర్వసాధారణం. శత్రువు దేశంపై యుద్ధం చేయడం అంటే బాంబు దాడులు మాత్రమే కాదు. శత్రు దేశాల మహిళల శరీరాలను విచ్ఛిన్నం చేయడం కూడా! వయసుతో సంబంధం లేకుండా ఎంతోమందిని నేను ఆ స్థితిలో చూశాను. ఒకసారి ఒక డెలివరీ కేసును స్టడీ చేయడానికి వెళ్లినప్పుడు అప్పటికే ప్రసవం అయిపోయింది. బిడ్డ 15 అంగుళాల కంటే ఎక్కువ పొడుగు లేదు. ఆ బిడ్డ బతికే అవకాశం కూడా లేదు. బిడ్డ తల్లిని చూద్దామని పక్క వార్డుకు వెళ్లాను. అక్కడ మంచంపై ఓ 10, 11 ఏళ్ల చిన్నపిల్ల పడుకుని ఉంది. తనకు కళ్లు లేవు. ఆ పాపే బిడ్డ తల్లి అని




చెప్పారు. ఆ క్షణం నాకు దుఃఖం తన్నుకొచ్చింది. అభం శుభం తెలియని వైకల్యం ఉన్న ఆ పిల్ల, పుట్టిన బిడ్డ బతకదని తెలిసి కూడా తన చేతులతో శిశువును ప్రేమగా తాకింది. ఆ దృశ్యం ఎప్పుడు గుర్తుకొచ్చినా నాకు కన్నీళ్లు ఆగవు" అని చెబుతున్న షైనీ లాంటి డాక్టర్లు మనకు చాలా అరుదుగా కనిపిస్తారు.

షైనీ తన సేవలను నిస్వార్థ సేవలు అంటే ఆమె ఒప్పుకోరు. "విజయవాడలో పుట్టిన నేను ప్రపంచ దేశాలు చుట్టి వచ్చాను. ఇప్పుడు లండన్‌కు వెళ్తున్నాను. దేశవిదేశాల్లో ఆరోగ్య మంత్రులతో ఎప్పుడైనా మాట్లాడగలను. వైద్యవిద్య చేసిన చాలామందికి ఈ అవకాశాలు రావు. ఇవే నన్ను ఈ మార్గంలో మరింత ముందుకు నడిపిస్తున్నాయి. ఆ ప్రయాణంలోనే వైద్య సేవలు అందిస్తున్నా... అంతే..." అంటారు చాలా నిగర్వంగా.


వైద్యవృత్తిని వృత్తిగా చేసే ఎంతోమంది వైద్యుల మధ్య షైనీ లాంటి వైద్యులు చాలా తక్కువమంది కనిపిస్తారు. ఇలాంటి వైద్యులు ఎంత సేవ చేసినా ఇంకా తాము చేయాల్సింది ఎంతో ఉందంటూ విస్తృత సేవా మార్గంలో ప్రయాణిస్తారు. ఇప్పుడు షైనీ చేస్తున్న ప్రయాణం కూడా అదే. "ఆక్స్‌ఫర్డ్‌లో అభ్యాసం తరువాత యూఎన్‌లో ఉన్నత స్థానం సాధించాలి. అప్పుడే ఎటువంటి నిర్బంధాలు లేకుండా వైద్య సేవలను మరింత మందికి అందించవచ్చు. పాలసీలు తీసుకురావచ్చు. ఆ లక్ష్యం కోసం ఎంత దూరమైనా ప్రయాణిస్తా" అంటున్న షైనీ ఆశ నెరవేరాలని మనమూ కోరుకుందాం.

# ఏడడుగుల దూరంలో ఆనందాల మజిలి

సంతోషం ఎక్కడో బయట దొరికేది కాదు. ఎంత ఖరీదు పెట్టినా సరే కూరగాయల్లా దానిని బజారులో కొనుక్కోలేం. మన ఆలోచనల్లో, అలవాట్లలో, జీవనశైలిలోనే అది దాగి ఉంటుంది. దాన్ని ఎలా సంపాదించుకోవాలో చెప్పే జపాన్ దేశానికి చెందిన ఏడు సూత్రాలు ఈమధ్య బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ముఖ్యంగా ఇంటి పనులతో సతమతమవుతూ జీవితం అంటే ఇంతేనా? అని ఇటీవలి కాలంలో నైరాశ్యానికి గురవుతున్న గృహిణులతో పాటు ఇంటా బయటా ఒత్తిడికి లోనవుతున్న ఉద్యోగినులకు ఇవి మంచి పాఠాలుగా ఉపయోగపడతాయి. ఇందులో ఇకిగై మనం చేసే పనులకు ప్రేరణ ఇస్తే, కైజెన్ ముందుకు నడిపిస్తుంది. హరా హాచిబు, పొమొడోరో ఆరోగ్యాన్ని కాపాడుతాయి. కింట్సుగి, వాబి–సాబి మనసుకు బలాన్నిస్తాయి. సెయిరి–సెయిటోన్ క్రమబద్ధతను నేర్పుతాయి. ఈ ఏడు జపాన్ సూత్రాలను రోజువారీ జీవితంలో కొద్దికొద్దిగా ఆచరిస్తే ప్రతి మహిళా.. తన జీవితాన్ని మరింత ప్రశాంతంగా, అర్థవంతంగా, ఆనందమయంగా మార్చుకోవచ్చు.

**ఇకిగై -- ప్రతి ఉదయానికీ ఒక అర్థం**

ఉదయం లేవగానే 'ఈ రోజు నేను ఎందుకు ఉత్సాహంగా ఉండాలి?' అనే ప్రశ్నకు సమాధానమే ఇకిగై. చాలామంది మహిళలు తమ జీవితాన్ని కుటుంబ బాధ్యతలకే పరిమితం చేసుకుంటారు. అయితే తమకు ఇష్టమైన రచన, సంగీతం, తోటపని, సామాజిక సేవ, వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచుకోవడం వంటి ఏదో ఒక అంశాన్ని జీవిత లక్ష్యంగా ఎంచుకుంటే ప్రతి రోజూ కొత్త ఉత్సాహంతో మొదలవుతుంది. ఉద్యోగం చేస్తున్న



మహిళకు తన పనిలోని సామాజిక ప్రయోజనం ఇకిగై కావచ్చు. గృహిణికి కుటుంబాన్ని సంతోషంగా ఉంచడం లేదా తన ప్రతిభను అభివృద్ధి చేసుకోవడం ఇకిగై కావచ్చు. జీవితానికి ఒక అర్థం కనిపించినప్పుడు ఒత్తిడి తగ్గి ఆత్మసంతృప్తి పెరుగుతుంది.

**కైజెన్ -- రోజుకో చిన్న అడుగు**

కొత్త సంవత్సరం వస్తే పెద్ద పెద్ద లక్ష్యాలు పెట్టుకోవడం సులభం. కానీ, వాటిని కొనసాగించడం కష్టం. కైజెన్ మాత్రం రోజుకు ఒక చిన్న మార్పు చాలని చెబుతుంది. బరువు తగ్గాలంటే మొదటి రోజే గంట వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు. రోజుకు పది నిమిషాల నడకతో మొదలుపెట్టవచ్చు. పుస్తకాలు చదవాలంటే రోజుకు రెండు పేజీలు చదివితే సరిపోతుంది. ఇలా చిన్నచిన్నగా మెరుగవడం వల్ల కొద్ది నెలల్లో పెద్ద ఫలితాలు వస్తాయి. మహిళలు తమ ఆరోగ్యం, ఆర్థిక నిర్వహణ, వృత్తి నైపుణ్యాల్లో ఈ సూత్రాన్ని అనుసరిస్తే ఆశ్చర్యకరమైన మార్పులను చూడగలరు.

**హారా హాచి బు -- ఆహార నియంత్రణ**

ఇంట్లో అందరికీ వడ్డించి చివరగా తినే మహిళలు చాలామంది. కొన్నిసార్లు ఆకలి కంటే ఎక్కువ తినడం కూడా జరుగుతుంది. మిగిలిపోయిన ఆహారాన్ని పారేయకుండా, పొట్టలో వేసేవాళ్లు చాలామందే. హరా హాచి బు సూత్రం ప్రకారం కడుపు పూర్తిగా నిండే వరకు కాకుండా సుమారు 80 శాతం నిండగానే భోజనం ఆపాలి. భోజనం నెమ్మదిగా నములుతూ తింటే త్వరగా తృప్తి కలుగుతుంది. ఇది బరువు నియంత్రణకు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులను దూరం పెట్టడానికి ఉపయోగపడుతుంది. 'ఇంకో ముద్ద తినాలా?' అనిపించినప్పుడు ఆగడం కూడా ఒక ఆరోగ్య అలవాటే.

**పొమొడోరో -- సమయానికి విలువ**

మహిళల రోజు ఒకేసారి ఎన్నో పనులతో నిండిపోతుంది. పిల్లల సంరక్షణ, వంట, ఉద్యోగం, ఇంటి పనులు.. ఇలా అన్నిటినీ నిర్వహించాల్సి వస్తుంది. పొమొడోరో పద్ధతి ప్రకారం ఒకేసారి ఒక పనిపైనే పూర్తిగా దృష్టి పెట్టాలి. ఉదాహరణకు 25 నిమిషాలు ఫోన్ పక్కన పెట్టి ఒక పనిని పూర్తి చేయాలి. ఆ తర్వాత ఐదు నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. మళ్లీ 25 నిమిషాలు పని చేసుకోవాలి. ఇలా చేస్తే పనులపై ఏకాగ్రత పెరుగుతుంది. రోజు చివరికి అలసట కూడా తక్కువగా ఉంటుంది.

**కింట్సుగి -- గాయాలను బలంగా మార్చుకో**

జీవితంలో ప్రతి మహిళ ఏదో ఒక సమయంలో నిరాశ, వైఫల్యం, అనారోగ్యం లేదా వ్యక్తిగత నష్టాన్ని ఎదుర్కొంటుంది. కింట్సుగి తత్వం ప్రకారం పగిలిన పాత్ర విలువ కోల్పోదు; దాన్ని బంగారంతో అతికిస్తే మరింత ప్రత్యేకంగా మారుతుంది. అలాగే మన జీవితంలోని గాయాలు, కష్టాలు మనల్ని బలహీనులను చేయవు. వాటి నుంచి నేర్చుకున్న పాఠాలే మన వ్యక్తిత్వాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుతాయి. విఫలమైన అనుభవాలను దాచిపెట్టకుండా వాటిని ఎదుగుదలకు మెట్లుగా మార్చుకోవాలని ఈ సూత్రం చెబుతుంది. కింట్సుగి పాత్ర పగుళ్లను దాచడానికి ప్రయత్నించదు. ఆ పగుళ్లే ఆ పాత్ర చరిత్రకు, అది ఎదుర్కొన్న కష్టాలకు గుర్తులు. బంగారం పూయడం ద్వారా ఆ గాయాలనే అత్యంత అందమైన భాగాలుగా మారుస్తుంది. భవిష్యత్తులో సాంకేతికత ఎంత పెరిగినా, మనుషుల్లో ఒత్తిడి, మానసిక ఆందోళనలు, బంధాలలో బీటలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి హైటెక్ యుగంలో కింట్సుగి ఒక గొప్ప 'హీలింగ్ టూల్' (వైద్యం)లా పనిచేస్తుంది. భవిష్యత్తులో రోబోలు, పర్‌ఫెక్ట్ అల్గారిథమ్స్ మనల్ని శాసిస్తున్నప్పుడు, మనలోని 'లోపాలే' మనల్ని మనుషులుగా నిలబెడతాయి. వైఫల్యాలను చూసి కుంగిపోకుండా, వాటిని బంగారు అనుభవాలుగా మార్చుకుని ముందుకు సాగడమే కింట్సుగి నేర్పే పరమార్థం. కాబట్టి మహిళలూ... పగుళ్లు పడిన జీవితాన్ని పారేయకండి, కింట్సుగితో దాన్ని ఒక అద్భుతమైన కళాఖండంగా మార్చుకోండి.

**సెయిరి -- సెయిటోన్..ఇల్లు శుభ్రం -- మనసు ప్రశాంతం**

అల్మరాల్లో, వంటగదిలో, మొబైల్‌లో, మన ఆలోచనల్లో కూడా అనవసరమైన విషయాలు పేరుకుపోతుంటాయి. సెయిరి అంటే అవసరం లేని వాటిని తొలగించడం. సెయిటోన్ అంటే మిగిలిన వాటిని క్రమబద్ధంగా అమర్చుకోవడం. నెలకు ఒకసారి ఇంట్లో ఉపయోగించని వస్తువులను తొలగించడం, పత్రాలను సక్రమంగా భద్రపరచడం, మొబైల్‌లో అవసరం లేని ఫైళ్లను డిలీట్ చేయడం వంటి చిన్న చర్యలు జీవితాన్ని తేలికగా మారుస్తాయి. క్రమబద్ధత పెరిగిన కొద్దీ మానసిక ప్రశాంతత కూడా పెరుగుతుంది.

**వాబి -- సాబి -- అసంపూర్ణతలోనే అందం**

కాలం గడుస్తున్న కొద్దీ వస్తువులు పాతబడతాయి, మనుషులకు వయసు పైబడుతుంది, ముడతలు వస్తాయి. వాబి–సాబి ప్రకారం.. పాతబడటం అనేది అందవిహీనం కానే కాదు, అది కాలం మనకు ఇచ్చిన అనుభవాల గుర్తు. రాలిపోయే ఆకులోనూ, పాతబడిన గోడలోనూ ఒక తెలియని నిశ్శబ్దం, అందం ఉంటాయి. సోషల్ మీడియా కాలంలో ప్రతి ఒక్కరూ పరిపూర్ణంగా కనిపించాలనే ఒత్తిడిలో ఉంటున్నారు.

# సినిమా సిత్రం


## సౌత్ మార్కెట్లో పాగా వేయడానికి దిగ్గజ కార్పొరేట్ల మాస్టర్ ప్లాన్..

అసలు వ్యూహం ఇదే! భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రాంతీయ మార్కెట్లు, ముఖ్యంగా సౌత్ సినిమా మార్కెట్ ఊహించని రేంజ్‌లో దూసుకుపోతోంది. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రాంతీయ మార్కెట్లు, ముఖ్యంగా సౌత్ సినిమా మార్కెట్ ఊహించని రేంజ్‌లో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో దక్షిణ భారత మార్కెట్‌తో పాటు దేశవ్యాప్తంగా పాగా వేయడానికి దిగ్గజ కార్పొరేట్ సంస్థలు ఒక భారీ మాస్టర్ ప్లాన్‌తో రంగంలోకి దిగుతున్నాయి. గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫైనాన్సింగ్ ప్లాట్‌ఫార్మ్ -సినీనౌ- ప్రముఖ మీడియా నిపుణుడు సిద్ధార్థ్ రాయ్ కపూర్‌ను తమ ప్రధాన సలహాదారుగా ఎంపిక చేసుకుని ఏకంగా 1,350 కోట్ల భారీ సినిమా ఐపీ (ఖ్రా) పెట్టుబడుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. దశాబ్దాల అనుభవజ్ఞుడైన సిద్ధార్థ్ రాయ్ కపూర్ వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో భారీ ఎత్తున



పాన్-ఇండియా సినిమాలను ప్లాన్ చేస్తూ వినోద రంగంలో సరికొత్త ఆర్థిక విప్లవానికి ఈ సంస్థ పునాది వేస్తోంది. కార్పొరేట్ సంస్థలు నమ్ముతున్న ఈ -ఐపి- (ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ) ఇన్వెస్ట్‌మెంట్ పుష్ విధానం సాంప్రదాయ సినిమా పెట్టుబడుల కంటే పూర్తిగా భిన్నమైనది. సాధారణంగా సినిమాల్లో పెట్టే పెట్టుబడులు కేవలం ఒకే ఒక సినిమా థియేటర్ కలెక్షన్లపై (ఫ్రైడే బాక్సాఫీస్) ఆధారపడి ఉంటాయి. కానీ ఐపి పెట్టుబడి విధానంలో.. సినిమా కథలు, ఓటీటీ హక్కులు, శాటిలైట్, మ్యూజిక్ రైట్స్, రీమేక్ -డబ్బింగ్ హక్కులతో పాటు భవిష్యత్తులో వచ్చే సీక్వెల్స్-ఫ్రాంచైజీల వంటి పలు రకాల -హక్కుల-ద్వారా వచ్చే దీర్ఘకాలిక ఆదాయాన్ని లక్ష్యంగా చేసుకుంటారు. సినీనౌ సంస్థ ఈ 1,350 కోట్ల నిధితో పలు భాషలలో దాదాపు 30కి పైగా చిత్రాల -పోర్ట్‌ఫోలియో-స్లేట్ ను నిర్మించనుంది. దీనివల్ల ఒక సినిమా ఆశించిన విజయం సాధించకపోయినా...ఇతర సినిమాల రైట్స్ ఆదాయం ఇన్వెస్టర్లకు రక్షణగా నిలుస్తుంది. పైగా విజయం సాధించిన సినిమాలకు ఇతర భాషల్లోనూ రీమేక్, డబ్బింగ్ రైట్స్ పరంగా భారీ డిమాండ్ ఏర్పడి అదనపు ఆదాయం సమకూరుతుంది. ఇదే సమయంలో మరో దిగ్గజ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ (=ఖీ) కూడా సౌత్ మార్కెట్-నేటి తరం డిజిటల్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ సరికొత్త ఐపి రిజిస్ట్రేషన్ల వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వైఆర్‌ఎఫ్ సంస్థ రస్క్ మీడియాతో చేతులు కలిపి -ఒరిజినల్ యానిమేషన్-.. మొబైల్ స్క్రీన్‌లపై నిలువుగా చూసేందుకు వీలుగా ఉండే -వర్టికల్ మైక్రో-డ్రామాలు- రూపొందిస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం.. రూపొందే అన్ని ఒరిజినల్ ప్రాజెక్టుల సృజనాత్మకతను, కథా విధానాన్ని వైఆర్‌ఎఫ్ సంస్థ పర్యవేక్షిస్తుంది. మరోవైపు రస్క్ మీడియా ఆ కంటెంట్‌ను నిర్మించడమే కాకుండా... తమ సొంత డిజిటల్ ప్లాట్‌ఫార్మ్ అయిన -ఆల్‌రైట్! టీవీ-.. ఇతర గ్లోబల్ డిజిటల్ ఛానెల్‌ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేయనుంది. ప్రస్తుతం మొబైల్ -ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో గ్లోబల్ -వర్టికల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎకానమీ-లో భారతదేశాన్ని ఒక బలమైన సృజనాత్మక శక్తిగా నిలబెట్టడం ఈ కూటమి ముఖ్య ఉద్దేశం. నేటి యువతరం స్మార్ట్‌ఫోన్‌లలో కంటెంట్‌ను ఎక్కువగా ఆస్వాదిస్తుండటంతో... వారిని ఆకట్టుకునేలా చిన్న నిడివి కథలను రీజినల్ .. పాన్-ఇండియా లెవెల్లో ప్రసారం చేయడానికి వైఆర్‌ఎఫ్ పక్కా ప్లాన్ చేస్తోంది.

## 'గాడ్ ఆఫ్ వార్' పోస్టర్లో ఏం చెప్పారు?




నిన్న అనౌన్స్ చేసిన జూనియర్ ఎన్టీఆర్- త్రివిక్రమ్ శ్రీనివాస్ కొత్త సినిమా గురించి దేశవ్యాప్తంగా పెద్ద చర్చే జరిగింది. నిన్న అనౌన్స్ చేసిన జూనియర్ ఎన్టీఆర్- త్రివిక్రమ్ శ్రీనివాస్ కొత్త సినిమా గురించి దేశవ్యాప్తంగా పెద్ద చర్చే జరిగింది. ఇంతకుముందు 'అరవింద సమేత' లాంటి సూపర్ హిట్ సినిమాను అందించింది ఈ జోడీ. కానీ ఈసారి వాళ్లు చేయబోయే సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కబోయే భారీ ఈవెంట్ ఫిలిం. మైథాలజీ సినిమాలు పూర్తిగా కనుమరుగైపోయిన సమయంలో ఈ ఇద్దరూ కలిసి ఈ జానర్ చిత్రం చేయడం అమితాసక్తిని రేకెత్తిస్తోంది. ఐతే ఈ ప్రాజెక్టు ఎగ్జైటింగ్‌గానే అనిపిస్తున్నప్పటికీ.. అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ మీద మాత్రం విమర్శలు తప్పలేదు. ఇది ఇది డిజైనర్స్ తయారు చేసింది కాదని.. ఏఐ ద్వారా మొక్కుబడిగా క్రియేట్ చేశారని.. పోస్టర్ అనుకున్నంత గొప్పగా, క్రియేటివ్‌గా లేదనే కామెంట్లు వినిపించాయి. ఐతే ప్రస్తుతం త్రివిక్రమ్ అంత ఖాళీగా లేడు. 'ఆదర్శ కుటుంబం' పనిలో బిజీగా ఉన్నాడు. 'గాడ్ ఆఫ్ వార్' మీద ఆయన దృష్టిపెట్టే పరిస్థితి లేదు. ఈ ప్రాజెక్టు గురించి ఊహాగానాలకు తెరదించి, ఒక క్లారిటీ ఇవ్వడానికే ఈ పోస్టర్ రిలీజ్ చేశారని అర్థమవుతోంది. కాబట్టి పోస్టర్ క్వాలిటీ గురించి మరీ ఎక్కువ చర్చ అనవసరం. ఇక ఈ పోస్టర్లో ప్రస్తావించిన సంస్కృత శ్లోకం గురించి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. సుబ్రహ్మణ్యస్వామి తమిళ దేవుడని, ఏదైనా శ్లోకం పెట్టాలంటే తమిళంలో ఉండాల్సిందంటూ తమిళులు తమదైన శైలిలో అభ్యంతరాలు పెడుతున్నారు. ఐతే అది శంకరాచార్యులు సంస్కృతంలో రచించిన శ్రీ సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రం నుంచి తీసుకున్నది కాబట్టి ఆ భాషలోనే శ్లోకాన్ని పెట్టారన్నది స్పష్టం. ఇక ఆ శ్లోకానికి అర్థమేంటన్నది కూడా డీకోడ్ చేశారు నెటిజన్లు. జానామి పద్యం న జానామి గద్యమ్ .. చిదేకా షడాస్యా హృది ద్యోతతే మే ముఖాన్నిఃసరంతే గిరశ్చాపి చిత్రమ్" ఇదీ పోస్టర్ మీద ఉన్న సంస్కృత శ్లోకం. దీనికి "నాకు శబ్ద జ్ఞానం లేదు. పదాల అర్థం తెలియదు. పద్యాలు రచించడం రాదు. గద్యం చెప్పడమూ రాదు. అయినప్పటికీ ఆరు ముఖాల షణ్ముఖుడు నా హృదయంలో ప్రకాశిస్తున్నాడు. అందుకే నా నోటి నుంచి స్తోత్రాలు అనర్గళంగా వస్తున్నాయి" అన్నది దీని అర్థం.


## నీల్ చుట్టూ 'ఐదు'.. మరి డైరెక్టర్ ప్లాన్ ఎలా ఉందో..

పాన్ ఇండియా డైరెక్టర్ ప్రశాంత్ నీల్.. కేజీఎఫ్, సలార్ వంటి భారీ విజయాల తర్వాత ఆయన చేసే ప్రతి సినిమా ఆసక్తిని రేకెత్తిస్తోంది. పాన్ ఇండియా డైరెక్టర్ ప్రశాంత్ నీల్.. కేజీఎఫ్, సలార్ వంటి భారీ విజయాల తర్వాత ఆయన చేసే ప్రతి సినిమా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఆయన చేతిలో ఉన్న ప్రాజెక్టులు, వినిపిస్తున్న కొత్త కాంబినేషన్ల వార్తలు చూస్తుంటే.. ప్రశాంత్ నీల్ చుట్టూ ఏకంగా ఐదు సినిమాలు తిరుగుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. అయితే వాటిలో ఏది ముందుగా పట్టాలెక్కుతుంది? డ్రాగన్ తర్వాత ఆయన అడుగు ఎటు పడుతుంది? అన్నదే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ పూర్తి దృష్టి జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న డ్రాగన్ చిత్రంపైనే ఉంది. భారీ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. దేశభక్తి అంశాలను యాక్షన్ తో మిక్స్ చేస్తూ తెరకెక్కిస్తున్న ఆ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా విడుదల తర్వాత మరోసారి నీల్ మార్క్ మాస్ ప్రెజెంటేషన్ ఎలా ఉండబోతుందో చూడాలని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. అయితే డ్రాగన్ పూర్తయ్యాక ప్రశాంత్ నీల్ ఏ సినిమా మొదలుపెడతారన్న అంశం చర్చనీయాంశమైంది. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన రెండు భారీ ప్రాజెక్టులు ఆయన ముందున్నాయి. అందులో మొదటిది ప్రభాస్ తో చేయనున్న సలార్ పార్ట్-2: శౌర్యాంగ పర్వం. ఫస్ట్ పార్ట్ ముగిసిన విధానం కారణంగా రెండో భాగంపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. దీంతో సినిమాను వీలైనంత త్వరగా ప్రారంభించే అవకాశాలున్నాయని టాక్ వినిపిస్తోంది. మరోవైపు యష్ తో తెరకెక్కనున్న కేజీఎఫ్ చాప్టర్-3 కూడా ప్రశాంత్ నీల్ లైనప్ లో ఉంది. ఆ సినిమాకు సంబంధించిన స్టోరీ లైన్ రెడీ అయిందని, సరైన సమయం కోసం వేచి చూస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కేజీఎఫ్ ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ వల్ల ఆ చిత్రాన్ని కూడా భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక అఫీషియల్ గా ప్రకటించని మరో మూడు ప్రాజెక్టుల గురించే ప్రస్తుతం ఎక్కువ చర్చ జరుగుతోంది.



టాలీవుడ్ కు చెందిన ఇద్దరు స్టార్ హీరోలతో ప్రశాంత్ నీల్ చర్చలు జరుపుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే బాలీవుడ్ నుంచి కూడా ఓ ప్రముఖ హీరోతో వర్క్ చేస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే ఆ కాంబోలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఇవన్నీ ప్రస్తుతం రూమర్లుగా ఉన్నాయి. నీల్ ముందు ఒకవైపు సలార్ పార్ట్-2, మరోవైపు కేజీఎఫ్ చాప్టర్-3, ఇంకోవైపు టాలీవుడ్ స్టార్ హీరోలతో అవకాశాలు, మరోపక్క బాలీవుడ్ ప్రాజెక్టు.. ఇలా మొత్తం ఐదు సినిమాల చర్చ ఆయన చుట్టూ తిరుగుతోంది.

## అయోమయంలో 'ది ప్యారడైజ్' రిలీజ్ డేట్.. ఇక వచ్చేది అప్పుడేనా..?




భారీ అంచనాలతో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' చిత్రబృందం ప్రస్తుతం ఒక విచిత్రమైన రిలీజ్ డేట్ పజిల్‌ను ఎదుర్కొంటోంది. మార్చి నుంచి మొదలుపెట్టి, మొన్నటి ఆగస్ట్ 21 వరకు ఎప్పటికప్పుడు సరికొత్త డేట్లతో ప్రేక్షకులను ఊరించినప్పటికీ, ఏదీ వర్కవుట్ కాలేదు. పైగా మేకర్స్ వదిలేసిన ఆగస్ట్ డేట్‌ను రవితేజ 'ఇరుముడి' టీమ్ చకచకా లాగేసుకోవడంతో, ఇప్పుడు 'ప్యారడైజ్' టీమ్ సెప్టెంబర్ 25 వైపు లుక్కేసింది. కానీ, తాజా ఇన్సైడ్ టాక్ ప్రకారం ఆ తేదీకి కూడా సినిమా రావడం అనుమానమే అంటున్నారు సినీ విశ్లేషకులు. ఈ డేట్ల మార్పుల వెనుక అసలు ట్విస్ట్ ఏంటంటే.. సినిమా ఇంకా గుమ్మడికాయ కొట్టడానికి సిద్ధంగా లేదట. కనీసం మరో రెండు నెలల పాటు నాన్‌స్టాప్‌గా షూటింగ్ చేయాల్సిన సీన్ ఇంకా బాకీ ఉంది. ఒకవేళ అక్టోబర్ నాటికి ఎలాగోలా గుమ్మడికాయ కొట్టి థియేటర్లలోకి వద్దామన్నా, అక్కడ 'రామాయణ' లాంటి పాన్-ఇండియా విజువల్ వండర్ కాచుకుని కూర్చుంది. ఆ సినిమాతో తలపడితే అటు బాలీవుడ్ బెల్ట్, ఇటు ఓవర్సీస్ మార్కెట్‌లో థియేటర్లు దొరకడం గగనమైపోతుంది. దీంతో నవంబర్ అనే డల్ సీజన్‌ను నమ్ముకోలేక మేకర్స్ తీవ్ర ఒత్తిడిలో పడ్డారు.

## క్రేజీ బజ్.. వచ్చే సంక్రాంతికి సాలిడ్ మల్టీస్టారర్‌తో మాస్ రాజా ఎంట్రీ?



2027 సంక్రాంతి బాక్సాఫీస్ రేసులోకి మాస్ మహారాజా రవితేజ, శ్రీవిష్ణు క్రేజీ మల్టీస్టారర్ వచ్చి చేరింది. 'రాజ రాజ చోర', 'స్వాగ్' చిత్రాల దర్శకుడు హసిత్ గోలి తెరకెక్కిస్తున్న ఈ సినిమా అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుంది. కామెడీ టైమింగ్‌లో దిట్టలైన రవితేజ, శ్రీవిష్ణు కలిసి నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అప్పుడే అంచనాలు పెరిగాయి. ఈ చిత్రాన్ని స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే 2027 పండగ బరిలో చిరంజీవి-బాబీ సినిమా, అనిల్ రావిపూడి మల్టీస్టారర్ మరియు 'కింగ్ 100' వంటి భారీ చిత్రాలు ఉన్నాయి. ఇప్పుడు రవితేజ-శ్రీవిష్ణు సినిమా కూడా తోడవ్వడంతో వచ్చే సంక్రాంతి బాక్సాఫీస్ వద్ద పండగ పోటీ అత్యంత రసవత్తరంగా మారనుంది.

## అన్నకు పోటీగా చెల్లెలు... ప్రభాకర్ కూతురు దివిజ టాలీవుడ్ ఎంట్రీ!



బుల్లితెర మెగాస్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రభాకర్ వారసత్వం ఇండస్ట్రీలో గట్టిగానే కొనసాగుతోంది. బుల్లితెర మెగాస్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రభాకర్ వారసత్వం ఇండస్ట్రీలో గట్టిగానే కొనసాగుతోంది. ఇప్పటికే ఆయన కొడుకు చంద్రహాస్ హీరోగా ఎంట్రీ ఇచ్చి, తన డిఫరెంట్ యాటిట్యూడ్ అండ్ మీమ్స్‌తో సోషల్ మీడియాలో ఎంతలా పాపులర్ అయ్యాడో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అన్నకు పోటీగా ప్రభాకర్ కూతురు కూడా ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తన క్యూట్ లుక్స్‌తో నెటిజన్ల మనసు దోచుకుంటూ ఏకంగా వెండితెరపై హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది. సోషల్ మీడియా క్వీన్ నుండి హీరోయిన్ వరకు: ప్రభాకర్ కూతురు దివిజ ప్రభాకర్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై కంటెంట్ క్రియేటర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఇక ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, షార్ట్ వీడియోలతో సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, యాక్టింగ్ టాలెంట్‌తో అందరి ఫోకస్ తనవైపు తిప్పుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు వెండితెరపై అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రెడీ అయ్యింది. 'వెంకట్రామయ్య గారి తాలూకా'తో పరిచయందివిజ ప్రభాకర్ మెయిన్ స్ట్రీమ్ హీరోయిన్‌గా టాలీవుడ్‌కు పరిచయం కాబోతోంది. 'వెంకట్రామయ్య గారి తాలూకా' అనే ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా సినిమాలో ఆమె లీడ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక మంచి కథాంశం ఉన్న సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుండడంతో, ఈ సినిమా ఆమె కెరీర్‌కు మంచి ప్లస్ అవుతుందని టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి. అన్నకు పోటీగా చెల్లెలి జోరు: ఇప్పటికే అన్న చంద్రహాస్ సినిమాలు చేస్తూ వార్తల్లో నిలుస్తుంటే, ఇప్పుడు చెల్లెలు దివిజ కూడా హీరోయిన్‌గా మారడం ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది. ఒకే ఇంట్లో ఇద్దరు యంగ్ సెలబ్రిటీలు హీరో, హీరోయిన్లుగా రాణించడం నిజంగా విశేషం. ఇక అన్న యాటిట్యూడ్‌తో పాపులర్ అయితే, చెల్లెలు మాత్రం తన క్యూట్‌నెస్‌తో, హోమ్లీ లుక్స్‌తో ప్రేక్షకులను మెప్పించడానికి వస్తోంది. దివిజ హీరోయిన్ అవుతున్న వార్త తెలియగానే సోషల్ మీడియాలో ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. "ప్రభాకర్ గారి కూతురు చాలా క్యూట్‌గా ఉంది, ఖచ్చితంగా మంచి హీరోయిన్ అవుతుంది" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197